"ఆకలితో ఉన్న సింహం కంటే అత్యాశతో ఉన్న మనిషి చాలా ప్రమాదకరం."
- గౌతమ బుద్ధుడు

Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 287 | ఆదివారం 03 మే 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## భారత బడ్జెట్‌కు యుద్ధ గండం

**- రాబోయే రోజులు గడ్డుకాలమే - కేంద్ర ఆర్థిక శాఖ హెచ్చరిక**

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం :



పశ్చిమాసియాలోని ఇరాన్-అమెరికాలోని యుద్ద ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కేవలం మూడు నెలల క్రితం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ 2026-27 అంచనాలను ఈ యుద్ధం పూర్తిగా తలకిందులు చేస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో పెరిగిన చమురు ధరలు, ఎరువుల ముడిపదార్థాల కొరత కారణంగా ప్రభుత్వ ఖజానాపై పెను భారం పడనుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. రాబోయే త్రైమాసికాలు దేశానికి అత్యంత పరీక్షా

- మిగతా 2లో..

## మోడీతత్వం.. ఆరెస్సెస్..
# హిందూయిజం

- వడోదర ఎంఎస్‌యూలో కొత్త సోషియాలజీ కోర్సులు
- తప్పుబడుతున్న విద్యావేత్తలు, మేధావులు
- సిలబస్ పునర్వ్యవస్థీకరణపై విమర్శల వెల్లువ

2లో





## సీఎం మమతా బెనర్జీ పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

హైదరాబాద్ - సూర్య వాస్తవం :

లెక్కింపులో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను మాత్రమే నియమించాలన్న ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సవాలు చేస్తూ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దాఖలు చేసిన పిటిషన్ ను సుప్రీంకోర్టు శనివారం కొట్టివేసింది. మే 4న కౌంటింగ్ నిర్వహించనున్నందున, తదుపరి ఆదేశాలు జారీ చేసేందుకు తిరస్కరించింది. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సిబ్బంది మిశ్రమంగా పనిచేయడానికి ఈ మార్గ దర్శ కాలు వీలు కల్పిస్తాయని, అయితే ఇసి తన ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు -అక్షరాలా స్ఫూర్తి' తో పాటించాలని జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ జోమాల్య బాగ్చిలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం స్పష్టం చేసింది.

# మాది ఫ్రెండ్లీ ప్రభుత్వం

- ఆరోగ్య భద్రతా కార్డులు
- ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం
- పీఆర్సీ నివేదికకు ఆదేశం
- మాది ఫ్రెండ్లీ ప్రభుత్వం
- ఉద్యోగ సంఘాల నాయకులతో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్- సూర్య వాస్తవం :

తమది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వారి సమస్యలను పరిష్కరించే బాధ్యత తమదేనని స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లో తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ, తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ నాయకులతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ పీఆర్సీ నివేదికను వెంటనే సమర్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. జూన్ 1లోగా ఆరోగ్య భద్రతా కార్డులు అందజేస్తామని హామీనిచ్చారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రతి పథకాన్ని ఉద్యోగులు భుజాన వేసుకుని పని చేశారని తెలిపారు. "ఉద్యోగుల సహకారంతోనే ప్రభుత్వ సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేయగలుగుతున్నాం. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల కోసమే మొదటి నిర్ణయం తీసుకున్నాం. ఉద్యోగులకు ప్రతీ నెలా మొదటి తేదీన వేతనాలు అందేలా చర్యలు తీసుకున్నాం. ఉద్యోగ సంఘాలు స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించుకునేలా అవకాశం కల్పించాం. ఉద్యోగుల బదిలీల విషయంలో గందరగోళం తలెత్తకుండా ప్రణాళిక

- మిగతా 2లో..

## పవన్ కల్యాణ్‌కు సీఎం చంద్రబాబు పరామర్శ

- గత కొంతకాలంగా పవన్‌కు అనారోగ్య సమస్యలు
- హైదరాబాద్‌లోని పవన్ నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన చంద్రబాబు
- శస్త్రచికిత్స నేపథ్యంలో తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచన
- తన నివాసానికి వచ్చిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన పవన్



హైదరాబాద్ - సూర్య వాస్తవం :

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను పరామర్శించారు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ కల్యాణ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం చంద్రబాబు జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసానికి

- మిగతా 2లో..



## డబ్బుల్ సోదాలు ఈడీ సోదాలు రెట్టింపు

- తగ్గిన అరెస్టులు..
పెరిగిన ఆస్తుల అటాచ్‌మెంట్

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి




## నేడు నీట్

అమరావతి - సూర్య వాస్తవం

వైద్య విద్య కోర్సుల ప్రవేశాలకు సంబంధించిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష(నీట్)-2026 ఆదివారం జరగనుంది. దేశవ్యాప్తంగా జరగనున్న ఈ పరీక్షకు నేషనల్ టెస్టింట్ ఏజెన్సీ(ఎన్టిఎ) ఏర్పాటు చేస్తోంది. సుమారు దేశవ్యాప్తంగా సుమారు 22.79లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్న ఈ పరీక్షకు ఎన్టిఎ దేశవ్యాప్తంగా 552 పట్టణాల్లో, ఇతర దేశాల్లో 14 చోట్ల పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఎపిలో సుమారు 70వేల మంది విద్యార్థులు ఈ పరీక్షకు దరఖాస్తు

- మిగతా 2లో..

## "శ్రీవారితో పెట్టుకోవద్దు జగన్ గారూ"..

- జగన్‌కు మంత్రి నారా లోకేష్ గట్టి వార్నింగ్
- శ్రీవారితో పెట్టుకోవద్దంటూ సోషల్ మీడియాలో పోస్ట్
- తిరుమల ఏర్పాట్లపై సాక్షి ఛానల్ దుష్ప్రచారం చేస్తోందని ఆరోపణ
- భక్తులతో బలవంతంగా నెగటివ్ ఫీడ్‌బ్యాక్ చెప్పించే ప్రయత్నం చేశారని విమర్శ
- సంబంధిత వీడియోను షేర్ చేసిన మంత్రి లోకేష్

అమరావతి- సూర్య వాస్తవం :



"కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి తో పెట్టుకోవద్దు జగన్ మోహన్ రెడ్డి గారు!" అంటూ ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తిరుమల శ్రీవారి దర్శన ఏర్పాట్ల విషయంలో సాక్షి మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపిస్తూ ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు.

- మిగతా 2లో..



## ఎన్నికల తర్వాత ప్రజలపై భారం మోపడం మోదీకి అలవాటు

- ఈ అద్భుత ఘనకార్యానికి గుర్తుగా దేశంలోని మ్యూజియంలలో మోదీ పేరును సువర్ణాక్షరాలతో రాయించాలి
- వాణిజ్య గ్యాస్ ధరల పెంపుపై ప్రధాని మోదీపై షర్మిల ఫైర్
- ఎన్నికల తర్వాత ప్రజలపై భారం మోపడం మోదీకి అలవాటు
- ఒకేసారి రూ. 993 పెంచి సామాన్యుల నడ్డి విరిచారని ఆరోపణ
- పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్

2లో

# భారత బడ్జెట్‌కు యుద్ధ గండం

(మొదటిపేజీ తరువాయి)
సమయమని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఎక్స్‌పెండేచర్ కార్యదర్శి వి. వుల్నామ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

**ఎరువుల సబ్సిడీ గుదిబండ..**

యుద్ధం కారణంగా దిగుమతి వ్యయం పెరగడంతో ఎరువుల సబ్సిడీ కోసం ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన నిధుల కంటే అదనంగా మరో రూ.50,000 కోట్లు ఖర్చు చేయాల్సి రావచ్చు. ఒకవైపు ఆదాయ వనరులు తగ్గుతున్న తరుణంలో ఇంత భారీ మొత్తంలో సబ్సిడీలు పెరగడం ఆర్థిక స్థిరత్వానికి సవాలుగా మారింది. దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను ==నియంత్రించేందుకు ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించడంతో ఆదాయం పడిపోవడం రెట్టింపు దెబ్బగా పరిణమించిందదన్నారు.

**ఆదాయంపై నీలి నీడలు..**

గత కొన్నేళ్లుగా కొనసాగుతున్న ఆర్థిక అనుకూల పవనాలు ముగిశాయని మంత్రిత్వ శాఖ సంకేతాలిచ్చింది. ఆర్థిక వృద్ధికి అనుగుణంగా పన్ను వసూళ్లు జరుగుతాయా లేదా అన్నది ఇప్పుడు సందేహంగా మారింది. అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో ఆటంకాలు, లాజిస్టిక్స్ ఖర్చులు పెరగడం వల్ల పారిశ్రామిక వృద్ధిపై ప్రభావం పడే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**మౌలిక వ్యయంపైనే దృష్టి..**

సబ్సిడీల భారం పెరిగినప్పటికీ, మౌలిక సదుపాయాల కల్పన కోసం కేటాయించిన నిధులను తగ్గించకూడదని ప్రభుత్వం భావిస్తోంది. అయితే యుద్ధం కారణంగా నెలకొన్న అనిశ్చితి వల్ల ప్రాధాన్యతలను మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. "రేపు ఏం జరుగుతుందో, వచ్చే కొన్ని గంటల్లో పరిస్థితి ఎలా మారుతుందో ఊహించడం అసాధ్యం" అని వుల్నామ్ పేర్కొనడం ప్రస్తుత తీవ్రతకు అద్దం పడుతోంది.

# పవన్ కల్యాణ్‌కు సీఎం చంద్రబాబు పరామర్శ



(మొదటిపేజీ తరువాయి)
వెళ్లారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు పవన్ కల్యాణ్, ఆయన భార్య అనా కొణిదెల సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పవన్ ఆరోగ్య పరిస్థితిని చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు.

శస్త్రచికిత్సకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. ఆరోగ్యం పూర్తిగా కుదుటపడే వరకు తగిన విశ్రాంతి తీసుకోవాలని పవన్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు కాసేపు సమావేశమై రాష్ట్రంలోని తాజా పరిస్థితులపై క్లుప్తంగా చర్చించుకున్నట్లు సమాచారం. తన ఆరోగ్యం గురించి తెలుసుకునేందుకు స్వయంగా నివాసానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు పవన్ కల్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# నేడు నీట్

(మొదటిపేజీ తరువాయి)
చేసుకునట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 28 పట్టణాల్లో సుమారు 150పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసింది. పరీక్ష కేంద్రానికి విద్యార్థులు అరగంట ఎన్టిఎ తెలిపింది. ఆదివారం పలు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా విద్యార్థులు ఏర్పాట్లు చేసుకోవాలని పేర్కొంది.

విద్యార్థులకు ఏవైనా సందేహాలు ఉంటే 011-40759000/011-69227700 నెంబర్లకు కాల్ చేయడం గానీ, అవవ్‌బస్త్ర2026ఏత్ఝ.ఖఽ.ఱఅ మెయిల్ ద్వారా గానీ సంప్రదించవచ్చని తెలిపింది.

# "శ్రీవారితో పెట్టుకోవద్దు జగన్ గారూ"..

(మొదటిపేజీ తరువాయి)
ఈ మేరకు లోకేష్ ఒక వీడియోను పంచుకున్నారు. తిరుమలలో ఏర్పాట్లు చాలా బాగున్నాయని భక్తులు చెబుతున్నప్పటికీ, సాక్షి ఛానల్ ప్రతినిధి మాత్రం ఏర్పాట్లు బాగాలేదని, ఇబ్బందులు పడుతున్నామని చెప్పించడానికి ప్రయత్నించి విఫలమయ్యారని ఆయన ఆరోపించారు. భక్తులు తాము సంతృప్తిగా ఉన్నామని చెప్పడంతో సాక్షి ప్రతినిధి భంగపడ్డారని లోకేష్ తన పోస్టులో పేర్కొన్నారు.

ఈ వీడియోను ఉటంకిస్తూ, వాస్తవాలను వక్రీకరించి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారంటూ విమర్శించారు. తిరుమల విషయంలో ఇటువంటి చర్యలకు పాల్పడవద్దని జగన్‌కు గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. ప్రస్తుతం లోకేష్ షేర్ చేసిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# మోడీతత్వం.. ఆరెస్సెస్.. హిందూయిజం

**వడోదర – సూర్య వాస్తవం :**
దేశంలో విద్యను కాషాయికరించడంలో మోడీ సర్కారు ఇప్పటికే పలు ప్రయత్నాలు మొదలు పెట్టింది. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) తీసుకొచ్చి ఇప్పటికే వివాదాన్ని రాజేసింది. ఇదే ఎన్ఈపీని ఆధారంగా చేసుకొని దేశంలో విద్యా స్వేచ్ఛను హరించేస్తోంది. తన కాషాయ సిద్ధాంతాలను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా రాజకీయ జోక్యాన్ని తీవ్రతరం చేస్తోంది. ఇందుకు బీజేపీ పాలిత రాష్ట్రం గుజరాత్‌లోని మహారాజ్ సయాజీరావ్ యూనివర్సిటీ ఆఫ్ బరోడా (ఎంఎస్‌యూ) సోషియాలజీ విభాగం ప్రవేశపెట్టిన కొత్త కోర్సులే నిదర్శనం. ఇందులో 'మోడీతత్వం', రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్)పై ఫీల్డ్ స్టడీ, హిందూ సోషియాలజీ, దేశభక్తి వంటి అంశాలు ప్రధానంగా ఉండనున్నాయి. దీంతో ఎంఎస్‌యూ నిర్ణయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

**ఓ కేస్ స్టడీగా మోడీ నాయకత్వం**

ఈ కొత్త కోర్సులు బీఏ సోషియాలజీ నాలుగో సంవత్సరం, ఎంఏ సోషియాలజీ మొదటి సంవత్సరంలో భాగంగా అమలు కానున్నాయి. సోషియాలజీ ఆఫ్ భారత్, హిందూ సోషియాలజీ, సోషియాలజీ ఆఫ్ పాట్రియాటిజం అనే మూడు ప్రధాన కోర్సులు నాలుగు క్రెడిట్లతో ప్రవేశపెట్టారు. మోడీ తత్వం అనే మాడ్యుల్‌లో ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వాన్ని ఒక కేస్ స్టడీగా పరిశీలిస్తారు. జర్మన్ సోషియాలజిస్ట్ మాక్స్ వెబర్ ప్రతిపాదించిన 'కరిస్మాటిక్ అథారిటీ' సిద్ధాంతాన్ని ఆధారంగా తీసుకొని ఈ అధ్యయనాన్ని రూపొందించారు.

**ఆరెస్సెస్‌ను సామాజిక సంస్థగా చూస్తాం : సోషియాలజీ విభాగాధిపతి వీరేంద్ర సింగ్**

యూనివర్సిటీ సోషియాలజీ విభాగాధిపతి డాక్టర్. వీరేంద్ర సింగ్ ప్రకారం.. "మోడీతత్వ ద్వారా ఆధునిక రాజకీయ నాయకత్వం, ప్రజలతో సంబంధం, పాలసీ ప్రభావం వంటి అంశాలను సోషియాలజీ దృష్టిలో అధ్యయనం చేయడం లక్ష్యం" అని తెలిపారు. 50 ఏండ్ల తర్వాత విశ్లేషించడం కంటే ఇప్పుడే విద్యార్థులు అధ్యయనం చేయాలని ఆయన చెప్పారు. కోర్సులో ఆరెస్సెస్ కార్యకలాపాలను కూడా చేర్చారు. గ్రామీణ గుజరాత్‌లో ఫీల్డ్‌వర్క్ సమయంలో ఆరెస్సెస్ ప్రభావం కనిపించడంతో దీనిపై అధ్యయనం చేయాలనే ఆలోచన వచ్చిందని చెప్పారు. ఆరెస్సెస్ ఒక ప్రభుత్వ సంస్థగా లేదా ఎన్జీఓగా వర్గీకరించలేమనీ, కానీ సామాజిక స్థాయిలో ప్రభావం చూపుతోందని చెప్పారు. అందుకే దీనిని సామాజిక సంస్థగా అధ్యయనం చేస్తామని ఆయన వివరించారు. కోర్సులో సయాజీరావ్ గైక్వాడ్ 3, సర్దార్ వల్లభభారు పటేల్, బీ.ఆర్.అంబేద్కర్, ఛత్రపతి శివాజీ మహరాజ్ వంటి ప్రముఖుల నాయకత్వం, సామాజిక సంస్కరణలు కూడా భాగం కానున్నాయి. సోషియాలజీ ఆఫ్ భారత్ కోర్సులో భారతీయ వ్యవస్థలపై అధ్యయనం ఉంటుంది. భారతీయ నాగరికతకు సంబంధించిన మూలాలను విద్యార్థులకు పరిచయం చేయడం దీని లక్ష్యం. అయితే ఈ కొత్త కోర్సులు అకాడమిక్ స్వతంత్రత, రాజకీయ ప్రభావం వంటి అంశాలపై చర్చకు దారి తీస్తున్నది.

**తాజా నిర్ణయంపై విమర్శల వెల్లువ**

ఎంఎస్‌యూ నిర్ణయం విమర్శలకు దారి తీసింది. ముఖ్యంగా 'మోడీ తత్వం' అనే అంశం, విద్యా వ్యవస్థలో రాజకీయ ప్రభావం పెరుగుతోందనే ఆందోళనలను కలిగిస్తున్నాయి. వాస్తవానికి సోషియాలజీ అనేది సమాజాన్ని విమర్శనాత్మకంగా, తటస్థంగా విశ్లేషించే శాస్త్రం. కానీ ప్రస్తుతం దేశ ప్రధానిగా ఉన్న, ఒక పార్టీకి చెందిన నరేంద్ర మోడీని కేస్ స్టడీగా చేర్చడం తప్పుడు సందేశాన్ని తీసుకెళ్లే ప్రమాదం ఉందని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు.

ముఖ్యంగా అధికారంలో ఉన్న నాయకుడి నాయకత్వాన్ని అధ్యయనం చేయడం, అకాడమిక్ స్వతంత్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇది విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచన కంటే వ్యక్తి కేంద్రీకృత దృక్పథాన్ని ప్రోత్సహించే ప్రమాదం ఉందని విశ్లేషకులు, విద్యావేత్తలు చెప్తున్నారు.

# మాది ఫ్రెండ్లీ ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)
ప్రకారం నిర్వహించాం. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల బదిలీలు ఎలాంటి వివాదం లేకుండా పూర్తి చేశాం. ఉద్యోగుల ఆరోగ్య భద్రతా కార్డుల ప్రతిపాదనపై కూడా ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఈ రెండేండ్లలో ప్రజా ప్రభుత్వంలో 67,760 ఉద్యోగ నియామకాలు చేపట్టాం. వంద రోజుల్లో ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం రూ.6 వేల కోట్లు చెల్లిస్తాం. ఈ నిధుల ఖర్చు ప్రాధాన్యతల నిర్ణయం మీదే. పీఆర్సీపై తక్షణమే రిపోర్టు అందించాలని అధికారుల కమిటీని ఆదేశించాం. రిపోర్టు ఆధారంగా పీఆర్సీపై నిర్ణయం తీసుకుంటాం. జూన్ 1లోగా ఆరోగ్య భద్రత కార్డులను ఉద్యోగులకు అందిస్తాం. ప్రతీ రెండు నెలలకోసారి గుర్తింపు సంఘాలు సమావేశమై సమస్యలపై ప్రభుత్వానికి రిపోర్టు అందించాలి. ఇది ఫ్రెండ్లీ ప్రభుత్వం... మీ సమస్యలను పరిష్కరించే బాధ్యత మాది" అని ఆయన భరోసా ఇచ్చారు.

**పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాం : డిప్యూటీ సీఎం భట్టి**

దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను చాలా వరకు పరిష్కరించామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో రూ.వేల కోట్ల బిల్లులు పేరుకుపోయాయని చెప్పారు. దీనిపై కసరత్తు చేసి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకెళ్తున్నట్టు తెలిపారు. 100 రోజుల్లో దాదాపు రూ.6 వేల కోట్ల పెన్షన్ బకాయిలను క్లియర్ చేసేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. ప్రభుత్వానికి ఉద్యోగులపై ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని తెలిపారు. ఉద్యోగుల హెల్త్ కార్డులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మానవీయ దక్పథంతో ఆలోచించారని చెప్పారు. వారి సమస్యల పరిష్కారం కోసం సీఎం ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తున్నారని వివరించారు. ఈ సమావేశంలో ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించిందని గుర్తు చేసుకున్నారు. టీవీవీపీలో 13,100 మందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పీఆర్సీ, హెల్త్ కార్డుల సమస్యలతోపాటు ఉద్యోగ సంఘాల ఇతర డిమాండ్లను పరిష్కరించాలని సీఎంకు వారు విజ్ఞప్తి చేశారు.

**5న నిరసన కార్యక్రమాలు రద్దు**

సీఎంతో చర్చల నేపథ్యంలో ఈ నెల 5న నిర్వహించ తలపెట్టిన నిరసన కార్యక్రమంతో పాటు అన్ని రకాల కార్యక్రమాలను రద్దు చేస్తున్నట్టు ఉద్యోగ జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్, టీజీఈజేఏసీ చైర్మెన్ వి.లచ్చిరెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల డిమాండ్లపై స్పష్టతనిచ్చిన ముఖ్యమంత్రికి వారు ధన్యవాదాలు తెలిపారు.

సీఎం హామీపై హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో ఉద్యోగ జేఏసీ సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస రావు, కో చైర్మెన్లు చావ రవి, జి.శ్రీనివాస్ రెడ్డి, పి.దామోదర్ రెడ్డి, జి.సదానందం గౌడ్, వి.రవీందర్ రెడ్డి, ముజీబ్ హుస్సేన్, బి.శ్యాం, కటకం రమేశ్, రామకృష్ణ గౌడ్, టి.లింగారెడ్డి, వెంకటేశ్వర్లు, ఎండీ అబ్దుల్లా టీజీఈజేఏసీ సెక్రెటరీ జనరల్ వి. రాజశేఖర్, నాయకులు కె.రామకృష్ణ, ఎస్.రాములు, ఏ.వెంకటేశం, బానాల రామిరెడ్డి, నిర్మల, దర్శన్ గౌడ్, రమేశ్ పాక, తెల్కలపల్లి పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల తర్వాత ప్రజలపై భారం మోపడం మోదీకి అలవాటు

- ఈ అద్భుత ఘనకార్యానికి గుర్తుగా దేశంలోని మ్యూజియంలలో మోదీ పేరును సువర్ణాక్షరాలతో రాయించాలి
- వాణిజ్య గ్యాస్ ధరల పెంపుపై ప్రధాని మోదీపై షర్మిల ఫైర్
- ఎన్నికల తర్వాత ప్రజలపై భారం మోపడం మోదీకి అలవాటు
- ఒకేసారి రూ. 993 పెంచి సామాన్యుల నడ్డి విరిచారని ఆరోపణ
- పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్

**అమరావతి– సూర్య వాస్తవం :**
వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలను భారీగా పెంచడంపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, కేంద్ర ప్రభుత్వం మరియు ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఓట్ల కోసం వేషాలు కట్టి, ఎన్నికలు ముగిసిన వెంటనే ప్రజలపై 'బండ బాదుడు' మోపడం మోదీకి అలవాటుగా మారిందని ఆమె ఘాటుగా విమర్శించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత కేంద్రం ఇచ్చిన అతిపెద్ద గిఫ్ట్ ఈ ధరల పెంపేనని షర్మిల ఎద్దేవా చేశారు. వాణిజ్య గ్యాస్ సిలిండర్‌పై ఒకేసారి రూ. 993, 5 కిలోల సిలిండర్‌పై రూ. 549 పెంచిన ఘనత మోదీకే దక్కుతుందని ఆమె అన్నారు. కేవలం ఆరు నెలల్లోనే రూ. 1,513 పెంచడం దేశ చరిత్రలోనే ఇది తొలిసారి అని, ఈ ఏడాదిలోనే ధర 80 శాతం పెరిగిందని ఆరోపించారు. ఈ అద్భుత ఘనకార్యానికి గుర్తుగా దేశంలోని మ్యూజియంలలో మోదీ పేరును సువర్ణాక్షరాలతో రాయించాలని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఈ ధరల పెంపు సామాన్యులకు వాతలు పెట్టడమేనని, బయట తినేవారిపై పెనుభారంగా మారుతుందని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. టీ స్టాల్స్, చిన్న హోటళ్లు నడుపుకునే వ్యాపారుల జీవితాలను అగమ్యగోచరంగా మార్చారని, విద్యార్థులు, వలస కార్మికుల నడ్డి విరిచారని విమర్శించారు. చమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు లాభాలు ఆర్జించిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు ధరలు పెరిగాయని ప్రజలపై భారం వేయడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. పెంచిన ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నట్లు షర్మిల స్పష్టం చేశారు.

# డబ్బుల్ సోదాలు ఈడీ సోదాలు రెట్టింపు

**న్యూఢిల్లీ– సూర్య వాస్తవం :**
కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాల సంఖ్య గతంలో పోలిస్తే రెట్టింపు అయ్యాయి. అరెస్టులు తగ్గి.. ఆస్తుల అటాచ్‌మెంట్ కేసులు పెరిగాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈడీ విడుదల చేసిన నివేదికలో ఈ అంశాలు పేర్కొన్నారు. సోదాలు పెరిగి.. అరెస్టులు తగ్గాయంటే ఆ కేసుల్లో బలమైన ఆధారాలు లేవనే విషయం స్పష్టమవుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కేంద్రంలోని బీజేపీ నేతృత్వ ప్రభుత్వం ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకొని ఈడీ, సీబీఐ ద్వారా అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురిచేస్తోందన్న విమర్శలున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈడీ వార్షిక నివేదికలోని అంశాలు కూడా వారి విమర్శలకు బలం చేకూర్చుతున్నాయి. 2025 -- 26 ఆర్థిక సంవత్సరంలో మనీలాండరింగ్ కేసులతో ముడిపడిన ఈడీ సోదాల సంఖ్య రెట్టింపు అయ్యి 2,892కు పెరగాయి. అంతకుముందు ఏడాది సోదాల సంఖ్య 1491గా ఉంది. అలాగే2024-25లో214మందిని అరెస్టు చేయగాల్ ఈ ఏడాది 27శాతం తగ్గి 156గా నమోదయ్యాయి. అత్యధికంగా 2023-24లో 272 మందిని అరెస్టు చేశారు. అలాగే దేశ చరిత్రలో మునుపెన్నడూ లేని రీతిలో అత్యంత భారీగా రూ.81వేల కోట్లకు పైగా విలువ చేసే ఆస్తులను ఇడి అటాచ్ చేసింది. 2025 ఏప్రిల్1 నుంచి 2026 మార్చి 31 మధ్యకాలంలో దర్యాప్తు చేసిన మనీలాండరింగ్ కేసులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఇందులో పొందుపరిచారు. నివేదికలోని కీలక అంశాలివీ -పక్కా ఆధారాలు లభించిన మనీ లాండరింగ్ కేసుల్లోనే అరెస్టులు చేస్తున్నామని,అందుకే అరెస్టులు తగ్గాయని వార్షిక నివేదికలో ఇడి అంగీకరించింది. 2025-26లో తమ ఉన్నతా ధికారుల నుంచి అందిన712ఆదేశాల అమలులో భాగంగానే రూ.81, 422కోట్లు విలువైన ఆస్తులను తాత్కాలికంగా అటాచ్‌మెంట్ చేశామని ఇడి తెలిపింది.ఈ ఆర్థిక సంవత్సరంలో ఆస్తుల అటాచ్‌మెంట్‌లు 171శాతం పెరిగాయని పేర్కొంది. 2024 -25లో ఉన్నతాధికారులు జారీచేసిన 461ఆదేశాల అమలులో భాగంగా రూ.30,036కోట్లు విలువైన ఆస్తులను అటాచ్ చేశారు. 2025-26లో రూ.32,678కోట్లు విలువైన ఆస్తులను ఆయా కేసుల్లో మోసపోయిన వారు, బాధితుల కోసం ఈడీ పునరుద్ధ రించింది. రిలీజైన ఈ ఆస్తుల్లో రూ.15,582కోట్లు విలువైనవి పెర్ల్స్ అగ్రోటెక్ కార్పొరేషన్ లిమిటెడ్ (పీఏసీఎల్)తో ముడిపడిన పోంజీ కేసుకు సంబంధించినవే అని పేర్కొంది.

# సంపాదకీయం

## ఉపశమనమా లేక దీర్ఘకాల అభివృద్ధా?

దేశంలో ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఉచితాలు అనే పదం రాజకీయాల్లో ప్రధాన ఆయుధంగా మారింది. ప్రతి పార్టీ కూడా ప్రజలను ఆకర్షించడానికి కొత్త కొత్త పథకాల పేరుతో ఉచితాలు ప్రకటిస్తోంది. ఉచిత విద్యుత్, ఉచిత డబ్బు పంపిణీ, ఉచిత గ్యాస్, ఉచిత ప్రయాణం వంటి అనేక పథకాలు ప్రజలకు తక్షణ ఉపశమనాన్ని ఇస్తున్నట్టే కనిపిస్తున్నాయి. కానీ ఈ ఉచితాల వెనుక ఉన్న అసలు ఉద్దేశం ఏమిటి? నిజంగా ఇవి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరుస్తున్నాయా? లేక ఓట్లు సాధించడానికి ఒక రాజకీయ వ్యూహమా? అనే ప్రశ్నలు తప్పనిసరిగా ఉత్పన్నమవుతున్నాయి. ఉచితాలు ఇవ్వడం అంటే తప్పు అని ఒకే పదంతో చెప్పలేం. ఎందుకంటే కొన్ని సందర్భాలలో ప్రభుత్వ జోక్యం అవసరం అవుతుంది. ఉపశమనా లేక దీర్ఘకాల అభివృద్ధా? ఈ రెండు మధ్య ఉన్న సున్నితమైన తేడాను గుర్తించకపోతే, ప్రజాస్వామ్యం స్వయం గా దారితప్పే ప్రమాదం ఉంది. ప్రస్తుతం మనం చూస్తున్న పరిస్థితి కూడా అదే. పేదరికం, ఆకలి, ఆరోగ్య సమస్యలు, విద్య లోపం వంటి అంశాలలో ప్రభుత్వం సహాయం చేయడం సమాజానికి అవసరం. ఉదాహరణకు, పేద విద్యార్థులకు ఉచిత విద్య, పేదలకు ఉచిత వైద్యం వంటి పథకాలు సమాజాన్ని ముందుకు తీసుకెళ్లే పునాది లాంటివి.ఇవి ఒక దేశ అభివృద్ధికి అవసరమైన మౌలిక హక్కులు. కానీ అదే సమయంలో ప్రతి అంశాన్ని ఉచితంగా మార్చడం, ప్రతి అవసరాన్ని ప్రభుత్వంపై ఆధారపడి తీర్చుకోవడం ఒక ప్రమాదకర దిశగా తీసుకెళ్తుంది. ఉచితాల రాజకీయాలు తాత్కాలికంగా ప్రజలకు ఆనందాన్ని ఇస్తాయి. ఎన్నికల సమయంలో ఇది మరింత ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఎందుకంటే ఒక వ్యక్తి తన రోజువారీ సమస్యలతో బాధపడుతున్నప్పుడు, అతనికి తక్షణ ఉపశమనాన్ని ఇచ్చే ఏ పథకమైనా ఆకర్షణీయంగా కనిపిస్తుంది. కానీ దీర్ఘకాలంలో ఈ పథకాల ప్రభావం ఎలా ఉంటుందో చాలా మంది ఆలోచించరు. ఒక సమాజం నిరంతరం ఉచితాలపై ఆధారపడితే, క్రమంగా కష్టపడి సంపాదించే భావన తగ్గిపోతుంది. స్వయం సమర్థత క్షీణిస్తుంది. వ్యక్తి తన సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ప్రయత్నించకుండా, ప్రభుత్వంపై ఆధారపడే పరిస్థితి ఏర్పడుతుంది.యువత అనేది ఒక దేశానికి బలం. వారి కృషి, ఆలోచనలు, సృజనాత్మకత దేశాన్ని ముందుకు నడిపిస్తాయి. కానీ అదే యువత ఉచితాలవల్ల అలసత్వానికి లోనైతే, దేశ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. చదువుకున్న యువకులు కూడా తమకు తగిన అవకాశాలు దొరకక చిన్న చిన్న ఉద్యోగాలలోనే నిలిచిపోతున్నారు. ఇది కేవలం వారి వైఫల్యం కాదు. ఇది ఒక వ్యవస్థలోని లోపం. విద్యావ్యవస్థ సరైన నైపుణ్యాలను అందించకపోవడం, పరిశ్రమల అభివృద్ధి లేకపోవడం, ప్రభుత్వ విధానాల్లో స్పష్టత లేకపోవడం, ఈ కారకాలన్నీ కలిసి ఈ పరిస్థితిని సృష్టిస్తున్నాయి. ఇక్కడ మరో ముఖ్యమైన అంశం ఆర్థిక పరిపాలన. ఒక ప్రభుత్వం ఉచితాలు ప్రకటించడానికి ముందు, ఆర్థిక వనరులు ఎలా సమకూర్చుకుంటుందో ఆలోచించాలి. ఆదాయం లేకుండా ఖర్చులు పెంచితే, అప్పులు తప్పవు. అప్పులు పెరిగితే, భవిష్యత్ తరాలపై భారమవుతుంది. ఈ రోజు తీసుకునే నిర్ణయాలు రేపటి తరాలకు ప్రభావం చూపుతాయి. కానీ ఎన్నికల రాజకీయాల్లో ఈ దీర్ఘకాల ఆలోచన చాలా సందర్భాల్లో కనిపించదు. తక్షణ ప్రయోజనాల కోసం భవిష్యత్తును తాకట్టు పెట్టే పరిస్థితి ఏర్పడుతోంది. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని గమనిస్తే చాలా చోట్ల అప్పులు పెరుగుతున్నాయి. ఒక ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, గత ప్రభుత్వంపై నిందలు వేయడం ఒక సాధారణ ధోరణిగా మారింది. వాళ్లు అప్పులు చేసి వెళ్లారు అనే వాదన వినిపిస్తుంది. కానీ అదే సమయంలో కొత్తగా కూడా అప్పులు తీసుకుంటూ ఉచిత పథకాలను కొనసాగించడం ఒక విరుద్ధమైన పరిస్థితి. ప్రజలు కూడా ఈ విషయాన్ని గమనించాల్సిన అవసరం ఉంది. ఒక ప్రభుత్వాన్ని కేవలం హామీల ఆధారంగా కాకుండా, ఆ హామీలను అమలు చేసే సామర్థ్యాన్ని బట్టి అంచనా వేయాలి. ప్రజాస్వామ్యంలో ఓటు ఒక శక్తి. ఆ శక్తిని ఎలా ఉపయోగించాలో ప్రజలపై ఆధారపడి ఉంటుంది. ఒక ఓటు ద్వారా మనం ఒక ప్రభుత్వాన్ని ఎంచుకుంటాం. ఆ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు మన జీవితాలను ప్రభావితం చేస్తాయి. కాబట్టి ఓటు వేసేటప్పుడు తక్షణ ప్రయోజనాలను కాకుండా, దీర్ఘకాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకోవాలి. ఉచితాలు ఇచ్చే పార్టీని కాకుండా, అవకాశాలు సృష్టించే పార్టీని ఎంచుకోవాలి.ఇక్కడ విద్య, ఆరోగ్యం గురించి ప్రత్యేకంగా చెప్పాలి. ఇవి ఉచితంగా అందించాల్సిన అత్యవసర రంగాలు. ఎందుకంటే ఒక వ్యక్తి చదువుకున్నప్పుడు, అతను తన జీవితాన్ని మార్చుకునే సామర్థ్యాన్ని పొందుతాడు. ఒక వ్యక్తి ఆరోగ్యంగా ఉన్నప్పుడు, అతను సమాజానికి ఉపయోగపడగలడు. కాబట్టి ఈ రెండు రంగాలలో పెట్టుబడి పెట్టడం ఖర్చు కాదు, అది ఒక పెట్టుబడి. ఇది దేశ భవిష్యత్తును నిర్మించే పునాది. అదే సమయంలో మిగతా రంగాలలో ఉచితాల కంటే అవకాశాలు ఇవ్వడం ముఖ్యమైనది. ఉద్యోగాలు సృష్టించడం, పరిశ్రమలను ప్రోత్సహించడం, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం, వ్యవసాయానికి మద్దతు ఇవ్వడం వంటి అంశాలు సమాజాన్ని స్థిరంగా ముందుకు తీసుకెళ్తాయి. ఒక రైతుకు ఉచిత డబ్బు ఇవ్వడం కంటే, అతనికి సరైన ధర, నీరు, మార్కెట్ ఇవ్వడం ఎక్కువ ప్రయోజనకరం. ఒక యువకుడికి ఉచిత సబ్సిడీ ఇవ్వడం కంటే, అతనికి ఉద్యోగం లేదా వ్యాపారం చేసే అవకాశాన్ని కల్పించడం ఉత్తమం. ప్రస్తుత రాజకీయ పరిస్థితులను పరిశీలిస్తే, హామీలు ఇవ్వడం చాలా సులభం. కానీ వాటిని అమలు చేయడం చాలా కష్టం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు కాకపోవడం ప్రజల్లో నిరాశను కలిగిస్తుంది. ఇది ప్రజాస్వామ్యంపై నమ్మకాన్ని కూడా దెబ్బతీస్తుంది. ఒక నాయకుడు చెప్పిన మాట నిలబెట్టుకోకపోతే, ప్రజలు రాజకీయ వ్యవస్థపై విశ్వాసం కోల్పోతారు. ఇక ప్రజల పాత్ర గురించి మాట్లాడితే, మార్పు ఎక్కడి నుండి వస్తుంది అనే ప్రశ్నకు సమాధానం స్పష్టంగా ఉంది, ప్రజల నుంచే. ఒక సమాజం చైతన్యవంతంగా మారితే, రాజకీయాలు కూడా మారతాయి. ప్రజలు తమ హక్కులను మాత్రమే కాకుండా, దీర్ఘకాల అభివృద్ధి ప్రాముఖ్యతను తెలియజేయాలి. మీడియా కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. సంచలనం కంటే సత్యాన్ని చూపాలి. మొత్తంగా చూస్తే, ఉచితాల రాజకీయాలు పూర్తిగా శాపమని చెప్పలేం. కానీ అవి నియంత్రణ లేకుండా కొనసాగితే, సమాజానికి నష్టం కలిగించే అవకాశం ఉంది. అవసరమైన చోట ఉచితాలు ఉండాలి, కానీ అవి ఒక వ్యూహంగా మారకూడదు. ప్రజల సంక్షేమం అనే పేరుతో ఓట్లు కొనే ప్రయత్నం ఆగాలి. ఈ రోజు మనం ఒక కీలక దశలో ఉన్నాం. ఒక దిశలో కొనసాగితే, మనం ఆధారపడి జీవించే సమాజంగా మారిపోతాం. మరో దిశలో ముందు కు సాగితే, మనం స్వయం సమర్థతతో అభివృద్ధి చెందే సమాజంగా మారగలం. ఈ ఎంపిక మన చేతుల్లోనే ఉంది. ప్రశ్న మళ్లీ అదే.. మార్పు ఎవరు తెస్తారు? జవాబు కూడా అదే, మనమే. ప్రజలు మేలుకుంటే, రాజకీయాలు మారతాయి. నాయకులు కూడా మారాల్సి వస్తుంది. హామీలు ఇవ్వడమే కాదు, వాటిని నిలబెట్టుకోవాల్సి వస్తుంది. ఆ రోజు తప్పకుండా వస్తుంది. కానీ అది స్వయంగా రాదు. మన ఆలోచనల్లో మార్పు వచ్చినప్పుడే, మన ఓటులో మార్పు వచ్చినప్పుడే, మన సమాజంలో మార్పు వస్తుంది. అందుకే ఇప్పుడు అవసరం, చైతన్యం, బాధ్యత, దీర్ఘకాల దృష్టి. ఉచితాల మాయ నుండి బయటపడి, అభివృద్ధి మార్గంలో నడవాల్సిన సమయం ఇదే.

# విద్యారంగం.. లోకేష్ మార్క్...

**విజయవాడ-సూర్య వాస్తవం :**
ప్రతి రాజకీయ పార్టీకి ప్రజలకు మంచి చేయాలని ఉంటుంది. కానీ విధానపరంగా వెళ్లే క్రమంలో రాజకీయాలు అలుముకుంటాయి. ఒకవైపు ప్రభుత్వ పాలన నడిపిస్తూనే రాజకీయాలు చేస్తేనే పార్టీలు మన గలవు. ప్రభుత్వపరంగా ఏ చిన్న మార్పు కోసం ప్రయత్నం చేసినా.. దాని వెనుక రాజకీయాలు అనేవి వెంటాడుతూనే ఉంటాయి. అయితే రాజకీయాలను పక్కనపెట్టి విద్యావ్యవస్థను సమూల మార్పులు తీసుకురావాలని మంత్రి నారా లోకేష్ భావించారు. ఇందుకు గట్టిగానే అడుగులు వేశారు. వాటికి సంబంధించిన సత్ఫలితాలు వచ్చాయి. పాఠశాల విద్యాశాఖలో సమూల మార్పులు తీసుకొచ్చారు. ఇప్పటివరకు పత్రిక ప్రకటనలకు కేవలం కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు మాత్రమే పరిమితం అయ్యాయి. తొలిసారిగా ప్రభుత్వ పాఠశాలల ఫలితాలను పత్రికల యాడ్ల రూపంలో ప్రచురించారు అంటే.. ప్రభుత్వ విద్య విషయంలో నారా లోకేష్ ఆలోచన ఎలా ఉందో ఇట్టే అర్థం అవుతుంది.మారుతున్న కాలానికి అనుగుణంగా ఈ పోటీ ప్రపంచంలో తట్టుకోవాలి అంటే.. కచ్చితంగా మెరుగైన విద్యా బోధన ఉండాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా పాఠ్యాంశాలు కూడా మారాలి. ఇదే ఆకాంక్షను పాఠశాల విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన లోకేష్ బయటపెట్టారు. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్యా వరకు పాఠ్యాంశాల పునర్నిర్మాణం చేపట్టారు. క్వాంటం టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, లాజిస్టిక్స్ వంటి గేమ్ చేంజర్ రంగాల్లో కొత్త కోర్సులను ప్రవేశపెట్టడం ద్వారా లోకేష్ సరికొత్త మార్పునకు శ్రీకారం చుట్టారు. ఒక విజయంతో పనిచేసి ఎన్సీఈఆర్టీ, ఐఐటి మద్రాస్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల సహకారంతో సరికొత్త కోర్సులను కూడా రూపొందించారుఒక్క ప్రాథమిక, ఉన్నత విద్య విషయంలో మాత్రమే కాదు.. యూనివర్సిటీల విషయంలో సైతం లోకేష్ ప్రత్యేక ఆలోచనలతో ముందుకు సాగారు. యూనివర్సిటీలు అనేవి కేవలం పరీక్షలు నిర్వహించే కేంద్రాలుగా ఉండకూడదు అనేది ఆయన భావన. సరికొత్త ఆవిష్కరణలకు నిలయంగా మారాలని భావిస్తున్నారు. ప్రతి యూనివర్సిటీని ఒక పారిశ్రామిక సంస్థతో అనుసంధానం చేయడం ద్వారా విద్యార్థుల్లో అనుభవం లభిస్తుంది అని భావించారు. అందుకే ప్రపంచంలోనే టాప్ 200 యూనివర్సిటీలతో భాగస్వామ్యం కుదుర్చుకోవాలని లక్ష్యం ఆయనలో కనిపించింది. ఎంతలా అంటే నర్సింగ్, పాలిటెక్నిక్ డిప్లమో వంటివి పూర్తి చేసిన విద్యార్థులకు ఏకంగా జర్మన్, రష్యా వంటి భాష లను నేర్పించి విదేశాల్లో ఉద్యోగాలు లభించే స్థాయికి వారిని తీర్చిదిద్దుతున్నారు అంటే లోకేష్ ఆలోచన ఇట్టే అర్థం అవుతుంది.పాఠశాల విద్యాశాఖ స్వరూపాన్ని మార్చారు. విద్యా బోధనను మార్చారు. పాఠ్యాంశాలను మార్చారు. అంతటితో ఆగలేదు ఆయన ప్రయత్నం. మధ్యాహ్నం భోజనం లో సమూల మార్పులు తీసుకొచ్చారు. పోషకాలతో కూడిన మెనూ, కిచెన్ గార్డెన్లు, డిజిటల్ బోధన ద్వారా పాఠశాల విద్యను మరింత బలోపేతం చేశారు. లీప్ యాప్ ద్వారా తల్లిదండ్రులకు జవాబుదారీగా ఉండడం.. మరుగుదొడ్ల పరిశుభ్రత వంటి చిన్న అంశాలనుంచి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వంటి పెద్ద అంశాల వరకు.. అన్ని నారా లోకేష్ ఆలోచనలే. వైసీపీ హయాంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. వాటిని గాడిలో పెట్టే పనిలో లోకేష్ కొంతవరకు సక్సెస్ అయ్యారు. అయితే ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల ఫలితాలను సైతం పత్రికలకు యాడ్ల రూపంలో ఇచ్చారు అంటే.. ప్రభుత్వ విద్యను ఏ స్థాయిలో నిలబెట్టారు అనేది ఇట్టే అర్థమవుతోంది.




### సర్కారీ స్కూల్స్ వైపు చూపు

ఏపీలో ప్రభుత్వ పాఠశాలలు వృద్ధి సాధించాయి. పదో తరగతి ఫలితాల్లో మెరుగైన స్థానాలను పొందాయి. కార్పొరేట్ తో పాటు ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు మెరుగైన ఫలితాలను సాధించడం విశేషం. సాధారణంగా ఫలితాలు వచ్చిన మరుసటి మీడియా ఫోకస్ అంతా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల ప్రకటనలపై ఉండేది. కానీ ఈసారి మాత్రం ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల కంటే.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో కూడిన ఫోటోలు పత్రికల్లో కనిపించాయి. భారీ ప్రకటనల రూపంలో ఆకట్టుకున్నాయి. వివిధ ప్రభుత్వ స్కూళ్లలో 550 కి పైగా మార్కులు సాధించిన విద్యార్థుల వివరాలను ప్రభుత్వం గర్వంగా ప్రకటించింది. ఇది కేవలం ఒక ప్రకటన అనుకుంటే పొరపడినట్టే. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే లక్షలాదిమంది విద్యార్థులకు, తల్లిదండ్రులకు భరోసా.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పాఠశాల విద్యాశాఖ బాధ్యతలు చూస్తున్నారు నారా లోకేష్. ఆయన చేపట్టిన విప్లవాత్మక సంస్కరణలు ఇప్పుడు క్షేత్రస్థాయిలో మంచి ఫలితాలు ఇస్తున్నాయి. కేవలం ప్రైవేట్ స్కూళ్లకు మాత్రమే పరిమితమైన క్వాలిటీ విద్యను.. ప్రభుత్వ పాఠశాలల్లోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఆయన అనేక మార్పులకు శ్రీకారం చుట్టారు. డిజిటల్ తరగతులు, నాణ్యమైన విద్యా బోధన, నిరంతర పర్యవేక్షణ వంటి చర్యలతో ప్రభుత్వ స్కూళ్లపై ప్రజల్లో నమ్మకం పెంచగలిగారు నారా లోకేష్. ఎగువ మధ్యతరగతి కుటుంబాలు సైతం ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా మంచి వాతావరణాన్ని సృష్టించగలిగారు. అందుకు అనుగుణంగా పాఠశాలలను తీర్చిదిద్దగలిగారు.వేటు స్కూళ్లతో ప్రభుత్వ స్కూళ్లు పోటీప్రభుత్వ పాఠశాలలంటే కేవలం పేద విద్యార్థులు చదువుకునే చోటు మాత్రమే కాదని, అక్కడ కూడా అత్యుత్తమ విద్యాబోధన అందుతుందని ఈ ప్రకటనలు నిరూపిస్తున్నాయి. భారీ మార్కులు, ర్యాంకులు కేవలం ఏసీ గదుల్లో చదివితేనే రావు.. నిబద్ధత గల ఉపాధ్యాయులు, మెరుగైన వసతులు ఉంటే ప్రభుత్వ బడిలోనూ స్టేట్ టాపర్స్ తయారవుతారని విద్యాశాఖ ఈ ప్రచారంతో స్పష్టం చేస్తోంది. ముఖ్యంగా, సామాన్య ప్రజల్లో ప్రభుత్వ విద్యావ్యవస్థపై ఉన్న చిన్నచూపును తొలగించి, నమ్మకాన్ని పెంపొందించడానికి ఇవి దోహదపడుతున్నాయి. గతంలో ప్రైవేటు స్కూళ్లలో మార్కులు రావడానికి కారణం వారి విద్యా విధానమే అన్న భ్రమలో తల్లిదండ్రులు ఉండేవారు. కానీ, నేడు ప్రభుత్వ స్కూళ్లలో డిజిటల్ తరగతులు, మెరుగైన మౌలిక సదుపాయాలు మరియు నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుల కృషి ఫలితంగా మార్కులు వస్తున్నాయని ప్రభుత్వం గట్టిగా చెబుతోంది. తమ పిల్లల ఫోటోలను ఇలా అధికారిక ప్రకటనల్లో చూసుకోవడం ఆ తల్లిదండ్రులకు జీవితకాలపు గర్వకారణంగా మారుతోంది. ఇది ఇతర విద్యార్థుల్లో కూడా పోటీ తత్వాన్ని, తాము కూడా సాధించగలమన్న ఆత్మవిశ్వాసాన్ని పెంచుతోంది.

### ప్రభుత్వ ప్రయత్నానికి ప్రశంసలు

ఈ ప్రయత్నం కేవలం ప్రచారానికి మాత్రమే పరిమితం కాకుండా, ఒక సామాజిక మార్పుకు నాంది పలుకుతోంది. ప్రైవేటు సంస్థల దోపిడీకి అడ్డుకట్ట వేయాలంటే ప్రభుత్వ బడులే శరణ్యమని భావించేలా చేస్తోంది. విద్యాశాఖ తీసుకున్న ఈ నిర్ణయంపై మేధావులు, విద్యావేత్తల నుంచి ప్రశంసలు అందుతున్నాయి. కేవలం అధికారుల మీదనే ఫోకస్ పెట్టకుండా, క్షేత్రస్థాయిలో విద్యార్థుల ప్రతిభను వెలుగులోకి తీసుకురావడం ద్వారా అటు ఉపాధ్యాయులను, ఇటు విద్యార్థులను ప్రభుత్వం ప్రోత్సహించినట్లు అయింది.వాస్తవానికి గత ఏడాదికంటే పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెరిగింది. గత ఏడాది కంటే 4.15% ఉత్తీర్ణత నమోదు పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 5,26,954 మంది ఉత్తీర్ణత సాధించారు. 83.69 శాతం మంది ప్రథమ శ్రేణిలోనే ఉత్తీర్ణులయ్యారు. బాలుర కంటే బాలికలే టాప్ గా నిలిచారు. 2161 పాఠశాలలో 100శాతం ఉత్తీర్ణత నమోదయింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరగడం అందర్నీ ఆకట్టుకుంది. పాఠశాల విద్యాశాఖలో తీసుకున్న చర్యలతోనే ఇది సాధ్యమైంది.

# కనిపించని వైసీపీ నేతలు




**తిరుపతి-సూర్య వాస్తవం :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి వచ్చేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోంది. నెక్స్ట్ మేమే అంటూ నేతలు ప్రకటనలు చేస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి నుంచి కిందిస్థాయి కార్యకర్త వరకు ఇదే మాట చెబుతున్నారు. కానీ ప్రభుత్వ వైఫల్యాలపై మాత్రం ప్రశ్నించే నేతలు కరువవుతున్నారు. ఒకరిద్దరు నేతలు మాత్రమే స్పందిస్తున్నారు. విశాఖలో ఏదైనా పరిణామం జరిగితే గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతున్నారు. మిడిల్ ఆంధ్రాలో ఏదైనా జరిగితే అంబటి రాంబాబు, పేర్ని నాని లాంటి నేతలు వ్యాఖ్యానాలు చేస్తున్నారు. రాయలసీమలో ఏమైనా జరిగితే నెల్లూరు జిల్లాకు చెందిన కాకాని గోవర్ధన్ రెడ్డి మీడియా ముందుకు వస్తున్నారు. మధ్యలో సజ్జల రామకృష్ణారెడ్డి ప్రెస్ మీట్ పెట్టి కొన్ని అంశాలపై స్పందిస్తున్నారు. వారికి మించి ఎవరు ముందుకు రావడం లేదు. నిజంగా ఇది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి లోటు. గత కొద్దిరోజులుగా రాష్ట్రంలో డీజిల్ అంశంపై పోరాటం చేస్తోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ ప్రధాన నేతలు ఎవరు దీనికి హాజరు కాలేదు. పేరు మోసిన నాయకులు కనిపించలేదు. వారంతా వీకెండ్ కామెంట్స్ అన్నట్టు వారంలో ఒకసారి మీడియా ముందుకు వచ్చి మళ్లీ సైలెంట్ అవుతున్నారు.

ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్ రెడ్డి విదేశీ పర్యటనలో ఉన్నారు. కుటుంబంతో సహా ఆయన మే 15 వరకు విదేశీ పర్యటనలోనే ఉంటారు. ఇంతలో రాష్ట్రంలో డీజిల్ కొరత ఏర్పడింది. దీనిపై ఆందోళనలు చేపట్టాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. అయితే ఒకటి రెండు చోట్ల మాత్రమే సీరియస్ గా దీనిపై ఆందోళన జరిగింది. చాలాచోట్ల తూతూ మంత్రంగా ముగించారు. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆందోళనలు ఆ పార్టీకి డ్యామేజ్ చేశాయి. దీనిపై ముందుగానే మేల్కొన్నారు చంద్రబాబుతో పాటు లోకేష్. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనవసరంగా సృష్టించిన వివాదం అంటూ తిరిగి కౌంటర్ ఇవ్వడం ప్రారంభించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల ఆరోపణల కంటే.. చంద్రబాబు కౌంటర్ ప్రజల్లోకి బలంగా వెళ్ళింది. ఇదంతా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సృష్టి అని అర్థం వచ్చేలా పరిస్థితి మారింది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకుంది అనేది ఆ పార్టీ నాయకత్వం నమ్మకం. కానీ ఆ పార్టీలో ఎవరు మాట్లాడుతున్నారు. ప్రభుత్వ చర్యలపై ఎవరు స్పందిస్తున్నారు. ఎక్కడికి అక్కడే నాయకులు తమ సొంత నియోజకవర్గాల్లో చిన్నపాటి కార్యక్రమాలు నిర్వహించి మమ అనిపించేస్తున్నారు. పెద్ద నాయకులు వీకెండ్ పేరిట బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో తలదాచుకుంటున్నారు. అంతకుమించి ఏమీ కనిపించడం లేదు కూడా. కానీ నెక్స్ట్ వచ్చేది మేమే అంటూ మాత్రం ప్రకటనలు చేస్తున్నారు. అధికారం ఉన్నప్పుడు అన్ని అనుభవించి.. ఇప్పుడు మాత్రం మొఖం చాటేస్తున్నారు.. ఏదో పార్టీలో ఉన్నాం అంటే ఉన్నాం అన్నట్టు మారిపోయారు వాళ్లు. ప్రభుత్వంపై విమర్శలు చేసే క్రమంలో చాలామంది నేతలు నవ్వుల పాలు అవుతున్నారు. తిరిగి కూటమి ప్రభుత్వానికి అస్త్రాలు అందిస్తున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

- సూళ్లూరుపేటలో ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ స్పష్టం
- 52 అర్జీల స్వీకరణ
- విద్యుత్, డ్రైనేజీ, రహదారుల సమస్యలు అధికం
- అర్జీల పరిష్కారంలో ఆలస్యం చేస్తే కఠిన చర్యలు: ఎమ్మెల్యే హెచ్చరిక
- క్షేత్రస్థాయిలోనే సమస్యల పరిష్కారం
- అధికారులకు స్పష్టమైన ఆదేశాలు
- ప్రతి అర్జీ ఆన్‌లైన్ నమోదు
- నిరంతర పర్యవేక్షణకు ప్రాధాన్యం
- విద్యుత్, డ్రైనేజీ, రహదారుల సమస్యలపై అధిక ఫిర్యాదులు
- ప్రజల్ని కార్యాలయాల చుట్టూ తిప్పకుండా సేవలు అందించాలి






**నాయుడుపేట – సూర్య వాస్తవం:** ప్రజల సమస్యలు పునరావృతం కాకుండా వేగవంతంగా పరిష్కరించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డా. నెలవల విజయశ్రీ తెలిపారు. సూళ్లూరుపేట ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలోని సి.వి.ఎ.పి కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రజల నుండి నేరుగా అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజల నుండి మొత్తం 52 అర్జీలను ఎమ్మెల్యే స్వయంగా స్వీకరించారు. అందిన అర్జీలలో ప్రధానంగా విద్యుత్ సరఫరా లోపాలు, డ్రైనేజీ వ్యవస్థలో సమస్యలు, రహదారుల మరమ్మతులు, భూ సంబంధిత వివాదాలు ఎక్కువగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రజలను పదేపదే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పకుండా, సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, పరిష్కారం అయ్యే వరకు దాని పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. ప్రజల వద్దకే పాలనను తీసుకువచ్చి, వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజా దర్బార్ ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే నియోజకవర్గంలోని పలు మండలాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు.

## మాజీ సీఎం

# నాదెండ్ల భాస్కరరావుకు ఘన నివాళులు

- ఉత్తరక్రియలలో పాల్గొన్న ఉయ్యాల ప్రవీణ్
- కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం



**నాయుడుపేట – సూర్య వాస్తవం :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రివర్యులు, సీనియర్ రాజకీయ నాయకులు స్వర్గీయ శ్రీ నాదెండ్ల భాస్కరరావు ఉత్తరక్రియల కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి, నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ శ్రీ ఉయ్యాల ప్రవీణ్ పాల్గొని, ఆ మహానేతకు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో భాగంగా ఆయన భాస్కరరావు గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు, జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ శ్రీ నాదెండ్ల మనోహర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వారి పితృవియోగానికి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉయ్యాల ప్రవీణ్ మాట్లాడుతూ, "స్వర్గీయ నాదెండ్ల భాస్కరరావు గారు ప్రజాసేవలో విశిష్ట స్థానాన్ని సంపాదించిన మహానేత. ఆయన సేవలు రాష్ట్ర రాజకీయాల్లో చిరస్మరణీయంగా నిలుస్తాయి" అని పేర్కొన్నారు. అలాగే, ఆయన ఆత్మకు సద్గతులు చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ తీరని లోటును భరించే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఉయ్యాల ప్రవీణ్‌తో పాటు పలువురు జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు పాల్గొని భాస్కరరావు గారికి ఘనంగా నివాళులు అర్పించారు.



## జనగణన కార్యక్రమాన్ని తనిఖీ చేసిన డిఆర్ఓ ఏ.మలోల..


**అనంతపురం– సూర్య వాస్తవం :** జనగణన కార్యక్రమంలో భాగంగా జిల్లా రెవిన్యూ అధికారి, జిల్లా సెన్సస్ అధికారి ఏ.మలోల శనివారం బుక్కరాయసముద్రం, గార్లదిన్నె మండలాల్లో జరుగుతున్న ఇండ్ల జాబితా (హౌస్ లిస్టింగ్), ఇండ్ల గణన ప్రక్రియలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన హౌస్ లిస్టింగ్ బ్లాక్ సరిహద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అందులోని రోడ్లు, వీధులు, ల్యాండ్‌మార్కులు మరియు భవనాలను క్రమబద్ధంగా నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా వాయువ్య దిశ నుండి ఆగ్నేయ దిశ వరకు ఒక నిర్దిష్ట పద్ధతిలో గణన గృహాలకు నంబర్లు కేటాయిస్తూ అమరిక పటాన్ని తయారు చేయాలని ఆదేశించారు. సూపర్వైజర్లు కూడా తమ పరిధిలోని హెల్ప్ సరిహద్దులను తనిఖీ చేసి, గణనలో ఎటువంటి ఇండ్లు వదలివేయకుండా మరియు పునరావృతం జరగకుండా పర్యవేక్షించాలని తెలియజేశారు.

అదేవిధంగా, ఇండ్ల జాబితా (హౌస్ లిస్టింగ్), ఇండ్ల గణన ప్రక్రియలో వివరాల సేకరణ కోసం ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు అందజేస్తున్న కిట్‌ను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సెన్సస్ విభాగం డిప్యూటీ తహసిల్దారు మధుసూదనరావు, బుక్కరాయసముద్రం మండలం డిప్యూటీ తహసిల్దారు నాగరాజు, సహాయ గణాంక అధికారి నాగలక్ష్మి, గార్లదిన్నె మండలం తహసిల్దార్ ఈరమ్మ, సహాయ గణాంక అధికారి విజయ్ కుమార్, ఎన్యుమరేటర్లు మరియు సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## గండి మారెన్న పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న తులసి రెడ్డి

**వేంపల్లె – సూర్య వాస్తవం:** గండి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో రాచవీటి మారెన్న గత 42 సంవత్సరాలుగా జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తూ సేవ చేస్తూ ఉన్నాడు. ఇటీవల పదవి విరమణ చేశాడు. మారెన్న పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా జరిగింది. రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి, టిడిపి వేంపల్లి మండల కన్వీనర్ సింగారెడ్డి మునిరెడ్డి, గండి దేవస్థానం చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, దేవస్థానం కార్యనిర్వహణ అధికారి పట్టెం గురు ప్రసాద్, దేవస్థానం ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ట్రస్ట్ బోర్డు మెంబర్ రామచంద్రారెడ్డి, ఎద్దుల చంద్ర, అశోక్, పవన్, తేజ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డిరవీంద్రనాథ్ రెడ్డి,ఐచర్ రమణ, చిన్నకోట్ల నాగరాజు తదితరులు పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ పవిత్ర పాపాగ్ని నదీ తీరాన శేషాచల పర్వతశ్రేణుల్లో వెలసిన శ్రీ శ్రీ శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో 42 సంవత్సరాలు సేవ చేసే భాగ్యం కలిగినందుకు మారెన్న ధన్యజీవి అన్నారు. ఉద్యోగంలో చేరిన ప్రతి ఉద్యోగికి విరమణ తప్పదు. ఈ నేపథ్యంలోనే మారెన్న పదవీ విరమణ చేశారన్నారు. మారెన్న శేష జీవితం ఆయురారోగ్య ఐశ్వర్యాలతో, ఆనందాలతో సాగాలని ఆకాంక్షించారు.



## జనగణన టీము ఎన్యుమరేటర్లకు సర్వే సంబంధిత మెటీరియల్ పంపిణీ



**గుత్తి – సూర్య వాస్తవం:** గుత్తి మున్సిపాలిటీకి సంబంధించిన సెన్సెస్ 2027 జనగణన టీము ఎన్యుమరేటర్లకు కమీషన్ బి.జబ్బార్ మియా సర్వే సంబంధిత మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు ఎన్యుమరేటర్లు సేవాభా వంతో సర్వేను ఖచ్చితత్వమైన డే టాతో ఆన్లైన్ చేసి మున్సిపాలిటీ ప్ర గతిని మెరుగు స్థాయిలో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఛార్జ్ ఆ ఫీసర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## రిజిస్టర్ రోగికి పింఛన్ అందజేసిన టీడీపీ నాయకులు



**కదిరి – సూర్య వాస్తవం:** కదిరి మున్సిపల్ పరిధిలోని ఆరో వార్డులో నివసిస్తున్న గంగులమ్మ అనే వృద్ధురాలు బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడి బెంగళూరు మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుందని గ్రహించిన ఆరో వార్డు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ గూని వాండ్ల చైతన్య బాధితురాలు ఇంటిని సందర్శించి వారి ఆర్థిక స్థితిగతుల ను తెలుసుకొని గత మూడు నెలలు పెన్షన్ అందలేదని తెలుసుకున్నారు. అయితే కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు ఆరో వార్డులోని సచివాలయం అడ్మిన్ రామాంజని తన సొంత ఖర్చులతో బెంగుళూరు కి తీసుకెళ్లి పింఛన్ అందజేయడం జరిగిందని ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా సచివాలయ అడ్మిన్ రామాంజికి చైతన్య కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఆర్డీటి సెట్ 2026కు పదో తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం..

**- ఈనెల 9వ తేదీయే ఆఖరి తేదీ !**



**ఉరవకొండ – సూర్య వాస్తవం :** ఆర్డీటి సెట్ పరీక్ష పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు ఇది ఒక మంచి అవకాశం. రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ వారు అందించే ఈ ప్రోత్సాహకం విద్యార్థులు వినియోగించుకోవాలని ఏటీఎల్ నారాయణ సూచించారు. అయన తెలిపిన వివరాల ప్రకారం, దరఖాస్తుకు ఉండవలసిన కనీస మార్కులు ఇలా ఉన్నాయి వివిధ విద్యా సంస్థల్లో చదువుకున్న విద్యార్థులకు కేటాయించిన కనీస మార్కుల వివరాలుప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు: 520 మార్కులు. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు: 550 మార్కులు. సీబీఎస్ఈ విద్యార్థులు: 430 మార్కులు ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 9వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. గ్రామీణ , అర్హులైన విద్యార్థులకు ఉన్నత చదువుల్లో చేయూతనివ్వడం ఈ పరీక్ష ప్రధాన ఉద్దేశ్యం. అర్హత ఉన్న విద్యార్థులు ఆలస్యం చేయకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవడం ఉత్తమం.

## మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం నేటి సమాజంలో ఎంతో అవసరం

**- ఆయాన్ అకాడమీ సమ్మర్ క్యాంప్‌లో మార్కెట్ యార్డ్ చైర్మన్ భూమా నాగ రాగిణి**



**తాడిపత్రి– సూర్య వాస్తవం :** తాడిపత్రి కృష్ణాపురం రోడ్‌లో జరిగిన ఆయాన్ టెకవందో అకాడమీ సమ్మర్ క్యాంప్ ప్రారంభో త్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మార్కెట్ యార్డ్ చైర్మన్ భూమా నాగ రాగిణి, అకాడమీ వ్యవస్థాపకులు సాయి మాస్టర్. మరియు పిల్లల తల్లితండ్రులు పాల్గొన్నారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ భూమా నాగ రాగిణి మాట్లాడుతూ ముఖ్యంగా నేటి కాలంలో అమ్మాయిలకు ఆత్మరక్షణ విద్యపై అవగాహన కల్పించడం అభినందనీయం. ఆత్మరక్షణ ప్రస్తుత సమాజంలో అమ్మాయిలకు మార్షల్ ఆర్ట్స్ అనేది ఒక అవసరమని, ప్రతి ఒక్కరూ దీనిని నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. తక్కువ సమయంలోనే జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో రికార్డులు, స్టంట్స్‌తో గుర్తింపు తెచ్చుకోవడంపై ప్రశంసలు కురిపించారు. ఈ సమ్మర్ క్యాంప్ ద్వారా పిల్లలకు కేవలం విద్య మాత్రమే కాకుండా క్రమశిక్షణ ఫిట్‌నెస్ నాయకత్వ లక్షణాలు అలవడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం విశేషం. ఇలాంటి శిక్షణా శిబిరాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయి.

# అన్నమయ్య గొప్ప సంఘసంస్కర్త : తులసి రెడ్డి

**వేంపల్లె - సూర్య వాస్తవం:** పద కవితా పితామహుడు, తెలుగులో తొలి వాగ్గేయ కారుడు, భక్తకవి, వెంకటేశ్వర స్వామి పరమ భక్తుడు అయిన తాళ్లపాక అన్నమాచార్య గొప్ప సంఘసంస్కర్త కూడా అని రాజ్యసభ మాజీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నరెడ్డి తులసి రెడ్డి కొనియాడారు. శనివారం వేంపల్లి లో కాంగ్రెస్ నాయకులు అన్నమయ్య 618 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ తాళ్లపాక అన్నమాచార్య 32 వేలకు పైగా సంకీర్తనలు రాశాడని, ఆయన సంకీర్తనల్లో భక్తి,సమానత్వం, మానవత్వం, నీతి, జీవన సత్యాలు ప్రతిబింబిస్తాయి అని అన్నారు. మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమి ఒకటే- చండాలుదుండేటి సరి భూమి ఒకటే అనే సమానత్వ, సామ్యవాద సిద్ధాంతాన్ని 600 సంవత్సరాల క్రితమే ప్రచారం చేసిన గొప్ప సంఘసంస్కర్త అన్నారు. తెలుగు సాహిత్యానికి అన్నమయ్య ఎనలేని కృషి చేశారన్నారు.అలతి అలతి పదాలతో, కడప మాండలికాలతో,సామెతలతో, సామాన్యునికి సైతం అర్థమయ్యే విధంగా అన్నమయ్య కవిత్వం ఉంటుంది. అన్నమయ్య బోధనలు, సంకీర్తనలు నేటి సమాజానికి ఆదర్శం,అనుసరణీయం, మార్గదర్శకం, స్ఫూర్తిదాయకం అని తులసి రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ధ్రువ కుమార్ రెడ్డి,వేంపల్లి మండల శాఖ అధ్యక్షులు బీగాల రామకృష్ణ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



**ప్రజలపై గ్యాస్ సిలిండర్ల భారం**
**- మోడీది కూతల, కోతల, వాతల ప్రభుత్వం**
**- వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధరను ఒక్కసారిగా 993 రూపాయలు పెంచడం దారుణం**

ఈ సంవత్సరం మార్చి 1వ తేదీన వాణిజ్య గ్యాస్ సిలిండర్ పై 28 రూపాయలు, మార్చి 7వ తారీఖున 114 రూపాయలు, ఏప్రిల్ మాసంలో 196 రూపాయలు పెంచడం జరిగింది. మళ్లీ ఇప్పుడు ఒక్కసారిగా 993 రూపాయలు పెంచడం జరిగింది . దీని వలన టీ కొట్లు,డాబాలు,హోటల్లు, బేకరీలు స్వీట్ షాప్లు ఇలా ప్రతి ఒక్కరి మీద కేంద్ర ప్రభుత్వం అదనపు ప్రారంభం మోపింది. అంతర్జాతీయంగా పెట్రోల్ ధరలు పెరిగాయి కాబట్టి వాణిజ్య సిలిండర్ల ధరలు పెంచడం జరిగిందని కేంద్ర ప్రభుత్వం చెప్పడం సాకు మాత్రమే.అంతర్జాతీయంగా పెట్రో ధరలు తగ్గినప్పుడు సిలిండర్ ధరలు తగ్గించకుండా ఆ లాభాన్ని కంపెనీలు, ప్రభుత్వం మూటగట్టుకున్నాయి.

ధరలు పెరిగినప్పుడు ఏమో ప్రజల మీద భారం మోపుతున్నారు.మే 4న ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే పెట్రోలు, డీజిల్ వంటగ్యాసు ధరలు మోడీ ప్రభుత్వం పెంచుతుందన్న అనుమానాలు ప్రజల్లో బలంగా ఉన్నాయి. మోడీది కూతల, కోతల, వాతల ప్రభుత్వంగా తయారయిందని తులసి రెడ్డి ధ్వజమెత్తారు.

# నీరుగట్టు వారి వివాహ వేడుకల్లో
# రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు





**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం :** రాయచోటి పట్టణం పిడిఆర్ కల్యాణ మండపంలో బుధవారం రాత్రి నిర్వహించిన నీరుగట్టు వారి వివాహ వేడుకలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు, రాయచోటి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు హాజరయ్యారు. రాయచోటి పట్టణం గాలివీడు రోడ్డు, లక్ష్మీపురం వాస్తవ్యులు కడప జిల్లా డిప్యూటీ సీఈఓ నీరుగట్టు రామచంద్ర కుమార్తె డాక్టర్ సాయి రమ్యత ఔవసం డాక్టర్ ూ. చైతన్య సారధి వివాహ వేడుకలో పాల్గొన్న ప్రసాద్ బాబు , నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. నూతన వధూవరులకు శుభమస్తు.. ఆనందమయ దాంపత్య జీవితం కలగాలని హృదయపూర్వకంగా ఆకాంక్షించారు


# మాధవ రెడ్డికి శ్రద్ధాంజలి ఘటించిన తులసి రెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం:** చక్రాయపేట మండలం చిలే కాంపల్లి పంచాయతీ,మేకల వాండ్లపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ఆవుల మాధవరెడ్డి అనారోగ్యంతో, వయోభారంతో శనివారం స్వర్గస్తులయ్యారు.ఈ విషయం తెలిసిన రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న,తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, ఐచెర్ రమణ, శాసనమండలి సభ్యులు రామ్ భూపాల్ రెడ్డి సతీమణి ఉమాదేవి,స్థానిక నాయకులు జగన్మోహన్ రెడ్డి, పంచ కొండారెడ్డి తదితరులు మాధవరెడ్డి భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ మాధవరెడ్డి తనకు ఎంతో ఆత్మీయుడని,పెద్దమనిషి అని,ఆయన మరణం చక్రాయ పేట మండలానికి తీరని లోటని అన్నారు.మాధవరెడ్డి పవిత్ర ఆత్మకు పరమేశ్వరుడు ప్రశాంతిని ప్రసాదించాలని ప్రార్థించారు.ఆయన కుటుంబ సభ్యులకు సంతాప సానుభూతిని తెలియజేశారు.

# శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠానికి కళ్యాణ పీఠం మకర తోరణం బహుకరణ

**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం :** జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠంలో గల మాస కల్యాణ మండపానికి స్థానిక బ్రహ్మంగారి మఠం గ్రామానికి చెందిన పబ్బతి అల్లూరయ్య శ్రేష్టి ధర్మపత్ని చంద్రమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు పబ్బతి కృష్ణయ్య శ్రేష్టి ధర్మపత్ని బాల వెంకటసుబ్బమ్మ కటకం రామకృష్ణయ్య శ్రేష్టి ధర్మపత్ని మహా లక్ష్మమ్మ పబ్బతి నాగేశ్వరరావు శ్రేష్ఠ ధర్మపత్ని ఉమామహేశ్వరి, వారి కుటుంబ సభ్యులు కళ్యాణ మండప పీఠం మరియు మకర తోరణంను పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకొని మఠం ప్రాంగణంలో పూజ నిర్వహించి మఠం యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం మఠాధిపతి శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల వారి చేతుల మీదుగా ప్రారంభించి పూజలు నిర్వహించారు అనంతరం మఠాధిపతి వీరధర్మజ వెంకటాద్రి స్వాముల వారిని వారి సోదరుడు దత్తాత్రేయ స్వామిని సన్మానించి వారి ఆశీస్సులు తీసుకున్నారు వచ్చిన భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.



# ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ



**చెన్నూరు-సూర్య వాస్తవం:** చెన్నూరు మండలం శివాల్ పల్లి జింకల వంకలో శనివారం ఉపాధి పనులు చేపడుతున్న ఉపాధి కూలీలకు శివాల పల్లి జింకల వంక ప్రక్కన వెలసిన శ్రీ వీరభద్ర లక్ష్మీ నరసింహ స్వామి( ఉరుకుంద ఈరన్న స్వామి) ఆలయం వ్యవస్థాపకులు. ఆధ్యాత్మికవేత్త. పొట్టి పాటి ప్రతాపరెడ్డి మరియు వారి కుటుంబ సభ్యులు మజ్జిగ పంపిణీ చేశారు. శివాలపల్లి. దళితవాడ. గోపవరం గ్రామానికి చెందిన వందమంది ఉపాధి కూలీలు జింకల వంకలో ఉపాధి పనులు చేస్తున్నారు. ఎండ వేడిమి తో పనులు చేస్తున్న కూలీలను చూసి ప్రతాపరెడ్డి మనసు చెలించిపోయింది. కూలీలకు సేద తీర్చేందుకు వీరభద్ర లక్ష్మీ నరసింహ స్వామి ఆశీర్వాదంతో శనివారం ఉపాధి పనులు చేస్తున్న మజ్జిగ పంపిణీ చేశారు. ప్రతాప్ రెడ్డి మజ్జిగ పంపిణీ చేయడంతో ఉపాధి కూలీలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ వీరభద్ర లక్ష్మీ నరసింహ స్వామి ఆశీర్వాదం ఆయన కటాక్షం వల్ల ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు.

# కల్వర్టును ఢీకొన్న కంకర లారీ

**- త్రుటిలో తప్పిన పెనుప్రమాదం**



**తాడిపత్రి - సూర్య వాస్తవం:** పెద్దపప్పూరు మండలం కమ్మవారి పల్లి గ్రామ సమీపంలో కంకర లోడుతో వెళ్తున్న ఒక లారీ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కల్వర్టును బలంగా ఢీకొంది.

**ప్రమాద తీవ్రత:**

**అప్రమత్తత:** ప్రమాదాన్ని ముందే పసిగట్టిన లారీ డ్రైవర్, క్లీనర్ వెంటనే కిందకు దూకేశారు. దీనితో వారు ఎటువంటి ప్రమాదం లేకుండా సురక్షితంగా బయటపడ్డారు.

**స్థానికుల కథనం:** కల్వర్టు పక్కనే ఒక లోతైన గుంత ఉంది. ఒకవేళ లారీ గనుక ఆ గుంతలో పడి ఉంటే ప్రాణనష్టం జరిగి ఉండేదని, సమయస్ఫూర్తితో వ్యవహరించడం వల్ల పెను ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు.

# నిజాయితీ చాటుకున్న కండక్టర్



**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి డోన్ ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్ రమణారెడ్డి నిజాయితీని చాటుకున్నారు. బస్సులో బ్యాగులో దొరికిన రూ. 10,000,మొబైల్ ఫోన్ బాధితురాలకు అందజేశారు.గుత్తికి చెందిన టీచర్ రాజేశ్వరి అనంతపురం వెళ్లారు. అక్కడి నుంచి గుత్తికి రావడానికి అనంతపురం బస్టాండ్లో బస్సులో సీటు కోసం బ్యాగు వేశారు. బస్సు వెళ్లిపోయింది. కండక్టర్ రమణా రెడ్డి బాధితురాలు వివరాలు తెలుసుకొని బ్యాగును అందజేసి నిజాయితీ చాటుకున్నారు.

# చక్రాయిపేట టిడిపి మాజీ అధ్యక్షుడు మృతి

**- సంఘీభావం తెలిపిన టిడిపి నాయకులు**

**వేంపల్లె - సూర్య వాస్తవం :** చక్రాయపేట మండలం టిడిపి మాజీ అధ్యక్షుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడైన మాధవ రెడ్డి మృతి చెందడం బాధకరమని టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ పేర్కొన్నారు. వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న మాధవ రెడ్డి మృతదేహాన్ని టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, టిడిపి నేత దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, లోమడ బాస్కర్ రెడ్డి (ఎల్ బిఆర్) తో పాటు పలువురు టిడిపి నేతలు నివాళు లర్పించారు. అందరిలో కలిసి పోయే మాధవరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. ఆకస్మిక మరణం చాల బాధ వేస్తున్నట్లు తెలిపారు. మాధవరెడ్డి ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అలాగే వారి కుటుంబ సభ్యులకు వారు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



## అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే అమిలినేని ఆర్థిక సాయం



**కంబదూరు - సూర్య వాస్తవం:** మేళ్లకుంట గ్రామస్థులు తమ గ్రామంలో అంబెడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. గ్రామస్థుల కోరికపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే, విగ్రహ ఏర్పాటుకు పూర్తి మద్దతు ప్రకటించారు. తన ఉదారతను చాటుకుంటూ, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు శనివారం తన సొంత నిధుల నుండి రూ. 50,000 నగదును విరాళంగా అందజేశారు. రాజ్యాంగ నిర్మాత విగ్రహాన్ని ప్రతిష్టించడం ద్వారా గ్రామంలో సామాజిక చైతన్యం పెరుగుతుందని, ఈ కార్యక్రమం గ్రామస్థులలో ఎంతో ఉత్సాహాన్ని నింపిందని అన్నారు. ఎమ్మెల్యే మంచి మనసుతో చేసిన సహాయానికి మేళ్లకుంట గ్రామస్థులు ఎమ్మెల్యే అలిమినేని సురేంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు

## నీట్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు చర్యలు.!

**- పరీక్షా కేంద్రాల పరిసరాలలో డ్రోన్ కెమేరాలచే నిఘా**
**- జిల్లా ఎస్పీ పి.జగదీష్**



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లాలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ న్యూఢిల్లీ వారు ఈనెల 03వ తేదీన నిర్వహించే నేషనల్ ఎలిజిబులిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్ ఫర్ అండర్ గ్రాడ్యుయేషన్ (యుజి) పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టామని జిల్లా ఎస్పీ పి.జగదీష్ పేర్కొన్నారు. ఈనెల 3వ తేదీన ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు నీట్ పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు.
జిల్లాలో 08 పరీక్షా కేంద్రాలలో నిర్వహించ బడుతుందని... ఇందు లో అనంతపురములో 6, గుత్తిలో 2 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ పరీక్షకు 3,616 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. నీట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి నిర్దేశించిన సమయంలోపు హాజరు కావాలన్నారు. పరీక్ష కేంద్రంలోకి మధ్యాహ్నం 01:30 గంటలలోపు చేరుకోవా లన్నారు. అభ్యర్థులు ఈ-అడ్మిట్ కార్డ్‌తో పాటు ప్రభుత్వంచే గుర్తింపబడిన ఏదో ఒక గుర్తింపు కార్డుతోపరీక్షకు హాజరు అవ్వాలన్నారు. ఈ పరీక్షకి మొబైల్ ఫోన్లు/ఐటీ గాడ్జెట్లు/బ్లూ టూత్/ఏదైనా ఇతర కమ్యూనికేషన్ పరికరాలు పరీక్ష కేంద్రములోనికి అనుమతించబడవన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద డ్రోన్ కెమేరాలు వినియోగిస్తున్నామన్నారు.

## శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠానికి కళ్యాణ పీఠం, మకర తోరణం బహుకరణ



**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం :** జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠంలో గల మాస కల్యాణ మండపానికి స్థానిక బ్రహ్మంగారి మఠం గ్రామానికి చెందిన పబ్బతి అల్లూరయ్య శ్రేష్టి ధర్మపత్ని చంద్రమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు పబ్బతి కృష్ణయ్య శ్రేష్టి ధర్మపత్ని బాల వెంకటసుబ్బమ్మ కటకం రామకృష్ణయ్య శ్రేష్టి ధర్మపత్ని మహా లక్ష్మమ్మ పబ్బతి నాగేశ్వరరావు శ్రేష్ఠ ధర్మపత్ని ఉమామహేశ్వరి, వారి కుటుంబ సభ్యులు కళ్యాణ మండప పీఠం మరియు మకర తోరణంను పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకొని మఠం ప్రాంగణంలో పూజ నిర్వహించి మఠం యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం మఠాధిపతి శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల వారి చేతుల మీదుగా ప్రారంభించి పూజలు నిర్వహించారు అనంతరం మఠాధిపతి వీరధర్మజ వెంకటాద్రి స్వాముల వారిని వారి సోదరుడు దత్తాత్రేయ స్వామిని సన్మానించి వారి ఆశీస్సులు తీసుకున్నారు వచ్చిన భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

# అడుగడుగునా తనిఖీలు.. అనుమానిత ప్రాంతాలపై జల్లెడ

**- అసాంఘిక కార్యకలాపాలు పాల్పడే వారిపై కఠిన చర్యలు**
**- సీఐ చాంద్ భాషా**





**చెన్నూరు- సూర్య వాస్తవం :** నిషేధిత మత్తు పదార్థాలు సేవించే వారిపై, అసాంఘిక కార్యకలా పాలపై అనుమానిత ప్రాంతాలపై స్పెషల్ పార్టీలతో, అత్యాధునిక డ్రోన్ కెమెరాల నిఘా తో స్పెషల్ డ్రైవ్ దాడులు చేపడుతున్నామని సీఐ చాంద్ బాషా పేర్కొన్నారు. శనివారం సాయంత్రం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా డ్రోన్ సహాయంతో సీఐ చాంద్ భాషా ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలతో పాటు అనిత ప్రాంతాలపై తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ చాంద్ బాష మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ బాలస్వామి రెడ్డి పర్యవేక్షణలో మండల వ్యాప్తంగా అనుమానిత ప్రాంతాలపై, బహిరంగ ప్రదేశాలలో గంజాయి మద్యం, నిషేధిత మత్తు పదార్థాలు సేవించే వారిపై చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. దీనిపై పోలీస్ అధికారులు స్పెషల్ పార్టీ సిబ్బంది ద్వారా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ, డ్రోన్ కెమెరాల ద్వారా సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నట్లు ఆయన తెలిపారు. చెన్నూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సేవనం, బహిరంగ మద్యపానం, జూదం, తదితర అసాంఘిక కార్యకలాపాలు జరిగే అనుమానిత ప్రాంతాల్లో పోలీస్ అధికారులు,ఈగల్, కడప సబ్ డివిజన్ స్పెషల్ పార్టీ సిబ్బంది దాడులు నిర్వహిస్తున్నారని, అలాగే అత్యాధునిక డ్రోన్ కెమెరాల తో పాటు పోలీస్ సిబ్బంది రంగంలోకి దిగి జల్లెడ పడుతూ దాడులు చేస్తూ నిందితులను గుర్తించే కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు..చెన్నూరు పరిధిలోని లక్ష్మి నగర్, సరస్వతి నగర్, కొత్త గాంధీ నగర్, పవర్ ఫ్యాక్టరీ, ఐఏఎస్ గెస్ట్ హౌస్, దౌలంతపురం, జగనన్న కాలనీ, ూ రామాపురం, చెన్నూరు టౌన్, శివాలయం, కొండపేట వీధి తదితర జనసంచారం లేని ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచడం ద్వారా అనుమానితులను గుర్తించే చర్యలు చేపట్టామని తెలిపారు. జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ ఆదేశాలతో నిరంతరం చెన్నూరు లోని అనుమానిత ప్రాంతాలను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జల్లెడ పట్టడం జరుగుతుందని చెన్నూరు సీఐ ూఖ చాంద్ బాషా తెలిపారు. ప్రజలు గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాలు సంబంధించిన సమాచారాన్ని ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు తెలియచేయాలని ఆయన సూచించారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. దాడుల్లో స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.





## 'అభివృద్ధి వికేంద్రీకరణ ఈవీఎంల'పై చర్చా వేదిక

**ఉరవకొండ - సూర్య వాస్తవం :** జి.ఆర్. మినీ ఏసీ ఫంక్షన్ హాల్లో జరిగిన కార్యక్రమం లో మేధావులు మాట్లాడుతూ అభివృద్ధి కేవలం కొన్ని ప్రాంతాలకే పరిమితం కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు విస్తరించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ చర్చా వేదికలో పలువురు మేధావులు, విశ్లే షకులు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. అలాగే ప్రముఖ ఆర్థికవేత్త పరకాల ప్రభాకర్ 2024 ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ఫలితాలపై కొన్ని సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా పోలింగ్ ముగిసే సమయంలో (రాత్రి 8:30 నుండి 11:45 మధ్య) ఓట్ల శాతం భారీగా పెరగడంపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. కేవలం కొన్ని సెకన్ల వ్యవధిలోనే ఇంత మంది ఓటర్లు ఓటు వేయడం ఎలా సాధ్యమని ఆయన ప్రశ్నించారు. ఈ డేటా విశ్లేషణ ఆధారంగా ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత లోపించిందని ఆయన అభిప్రాయపడ్డారు. వైసీపీ నాయకులు,అధికార ప్రతినిది సీపీ వీరన్న మాట్లాడుతూ ఈవీఎం ల పనితీరుపై అనేక అనుమానాలను వ్యక్తం చేశారు. పోలింగ్ ముగిసే సమయానికి 40-50% ఉన్న ఈవీఎం బ్యాటరీ ఛార్జింగ్, కౌంటింగ్ రోజు నాటికి 99% కి ఎలా పెరిగిందని వారు ప్రశ్నించారు. ఇది యంత్రాలను మార్చడం లేదా ట్యాంపరింగ్ చేయడం వల్ల జరిగి ఉండవచ్చని ఆరోపించారు. పోలింగ్ చివరి గంటలో సుమారు 51 లక్షల ఓట్లు పోల్ అవ్వడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల పారదర్శకత కోసం భవిష్యత్తులో ఈవీఎం లకు బదులుగా మళ్ళీ పేపర్ బ్యాలెట్ విధానాన్ని తీసుకురావాలని వైస్సార్సీపీ బృందం కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి విన్నవించింది అని వైస్సార్సీపీ అధికార ప్రతినిధి సీపీ వీరన్న అన్నారు. ఈ కార్యక్రమం లో ప్రొఫెసర్ రామచంద్రయ్య సామాజిక ఆర్థిక విశ్లేషకులు, పరకాల ప్రభాకర్ ఆర్థికవేత్త, తరిమెల అమర్నాథ్ రెడ్డి మానవత రక్తదాతలు సంస్థల కన్వీనర్, సలీం మాలిక్, వై.పురుషోత్తం రెడ్డి: సభాధ్యక్షులు (విశ్రాంత ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అనంతపురం). గోని నాగన్న(రెండవ సెషన్ - అడ్వకేట్). ఎస్. ఎం. బాషా: సభాధ్యక్షులు (రాష్ట్ర నాయకులు, మానవ హక్కుల వేదిక). కె. నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.







## విష్ణు తేజు గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు

**గుత్తి -సూర్య వాస్తవం:**గుత్తి గుంతకల్లు నియోజకవర్గం గుత్తి తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ హరినాథ్ గౌడ్ కుమారుడు విష్ణు తేజు గౌడ్ జన్మదిన శుభాకాంక్షలు వారికి ఆ సాయి బాబా చల్లని చూపులు ఇవ్వాలని ఆ భగవంతుని కోరుకుంటున్నాను అన్నారు.గుత్తి మండలం వన్నెదొడ్డి గ్రామం గుత్తి మా జీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మోడీ శ్రీనివాస్ యాదవ్



# 'గాయపడ్డ సింహం' మూవీ రివ్యూ



దర్శకుడిగా ప్రతిభను చాటుకున్న తరుణ్ భాస్కర్ నటుడిగా కూడా నిరూపించుకోవాలని కథానాయకుడిగా సినిమాలు చేస్తున్నాడు. కానీ ఇప్పటి వరకు నటుడిగా ఆయనకు సరైన గుర్తింపు దక్కలేదు. ప్రేక్షకులు కూడా ఆయన్నీ నటుడిగా పూర్తిస్థాయిలో యాక్సెప్ట్ చేయలేదు. తరుణ్ మాత్రం దర్శకత్వం కంటే ఎక్కువగా నటనే మీద ఫోకస్ పెట్టి సినిమాలు చేస్తున్నాడు. తాజాగా ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'గాయపడ్డ సింహం'. ఈ చిత్రమైనా నటుడిగా ఆయనకు గుర్తింపు తెచ్చిపెట్టిందా? గాయపడిన సింహంలో ప్రేక్షకులను అలరించే అంశాలున్నాయా? అనేది తెలుసుకోవాలంటే సినిమా సమీక్ష చదవాలి.

ధరహాస్ (తరుణ్ భాస్కర్), గాయత్రి (మానస చౌదరి) ప్రేమించుకుంటారు. అయితే గాయత్రిని, ధరహాస్‌కు ఇచ్చి పెళ్లి చేయాలంటే ధరహాస్ అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడాలని కండిషన్ పెడతాడు గాయత్రి తండ్రి (అనీష్ కురువిల్లా). ఇక దరహాస్ పలు ఇబ్బందులతో వీసా సంపాందించి అమెరికా వెళతాడు. కానీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పెట్టిన నిబంధనలతో... ధరహాస్ కేవలం 34 గంటల్లోనే అమెరికా ఎయిర్‌పోర్ట్ నుంచే.. మళ్లీ ఇండియాకు తిరిగి రావాల్సి వస్తుంది. దీంతో తన గాయత్రితో పెళ్లి జరగడం కుదరదని తెలియడంతో తన జీవితాన్ని నాశనం చేసిన ట్రంప్‌పై దరహాస్ పగ తీర్చుకోవాలనుకుంటాడు. తన స్నేహితుడికి స్నేహితుడైన భైరవదాస్ (శ్రీ విష్ణు)తో ట్రంప్‌పై చేతబడి (బ్లాక్ మ్యాజిక్) చేయించాలని నిర్ణయించుకుంటాడు. ఇక ఆ తరువాత ఏం జరిగింది? ట్రంప్‌పై భైరవదాస్ చేతబడి చేశాడా? ధరహాస్ మళ్లీ అమెరికాకు వెళ్లాడా? తన ప్రేయసి, గాయత్రిని పెళ్లి చేసుకున్నాడా? లేదా? ఈ క్రమంలో బ్రూటల్ ధర్మ (జేడీ చక్రవర్తి)కి ఈ కథకు సంబంధమేమిటి? ఈ కథతో శాలినికి (ఫరియా అబ్దుల్లా) ఉన్న లింకేమిటి? భైరవదాస్ ఎంట్రీతో కథ ఎలాంటి మలుపు తిరిగింది? అనేది మిగతా కథ.

కొత్త కాన్సెప్ట్‌లతో సినిమాలను ప్రేక్షకులకు ఆదరిస్తున్నారు.. మనం కూడా కొత్తగా చేయాలి అనే ఆలోచనతో నేటి దర్శకులు కథా రచయితలు వింత వింత కాన్సెప్ట్‌లతో సినిమాలు చేస్తున్నారు. ఈ సినిమా కూడా ఆ కోవలోకి చెందినదే. అమెరికా అధ్యక్షుడిపై చేతబడి చేయించడం అనే వింత కాన్సెప్ట్ ఫన్నీగా అనిపిస్తుంది. అయితే ఇలాంటి కథలు పేపరు మీద ఉన్నప్పుడు ఫన్నీగా అనిపించినా, తెరపైకి వచ్చే సరికి సిల్లీగా అనిపిస్తాయి. ఇది అలాంటి సినిమానే. కాన్సెప్ట్ కొత్తగా ఉన్నప్పటికి ఈ సినిమాను ఇంట్రెస్టింగ్ స్క్రీన్‌ప్లేతో తెరపై తీసుకరావడంలో దర్శకుడు విఫలమయ్యాడు. సినిమా ఆద్యంతం ఎక్కడా కూడా ఇంట్రెస్టింగ్‌గా అనిపించదు. బొమ్మరిల్లు, పోకిరి, అర్జున్ రెడ్డి, సినిమాలపై వేసిన సెటైర్లు కొంత మందికి నవ్వులు తెప్పిస్తే, మరి కొంత మందికి చిరాకు కలిగిస్తాయి. దర్శకుడిగా తమ ప్రతిభను వర్జినల్ కంటెంట్‌తో చూపించే ప్రయత్నంను విస్మరించి, సక్సెస్‌ఫుల్ సినిమాలపై కామెడీ చేయడం కొంత మంది దర్శకులకు అలవాటుగా మారిపోయింది. ఈ చిత్రంలో కశ్యప్ శ్రీనివాస్ కూడా అదే పంథాను అనుసరించాడు. ఫస్టాఫ్ నెమ్మదిగా కొనసాగుతూ, ఇంటర్వెల్‌కు వచ్చే సరికి ఆడియన్స్‌లో ఇంట్రెస్ట్ కలిగించే ప్రయత్నం చేసినా అది సఫలం కాలేదు.

సినిమా సెకండాప్ చూడాలనే ఉత్సుకత కలిగించలేదు. ఫస్టాఫ్‌తో పోలిస్తే, సెకండాఫ్ పరవాలేదనిస్తుంది. అయితే ఓవరాల్‌గా గాయపడ్డ సింహం ప్రేక్షకులను పూర్తిస్థాయిలో సంతృప్తి పరచడంలో సక్సెస్ కాలేదు. కాసిని నవ్వులతో ఆద్యంతం బోరింగ్‌గానే కొనసాగింది. కాన్సెప్ట్ మినహా సినిమా మొత్తంలో ఎక్కడా కూడా కొత్తదనం కనిపించలేదు.

తరుణ్ భాస్కర్ నటన ఫర్వాలేదనిపించినా.. ఇంకా ఆయన నటనలో మెరుగులు దిద్దుకోవాల్సిన అవసరం ఉంది. ఫరియా అబ్దుల్లా పాత్ర రెగ్యులర్‌గా బోరింగ్‌గా అనిపించింది. ఫరియా కొత్త పాత్రలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. దరహాస్ స్నేహితుడిగా నటించిన ఈ చిత్ర దర్శకుడు కశ్యప్ శ్రీనివాస్ నటుడిగా కొన్ని నవ్వులు పంచే ప్రయత్నం చేశాడు. శ్రీ విష్ణు పాత్ర మొదట్లో ఇంట్రెస్టింగ్‌గా అనిపించినా, ఆ తరువాత బోరింగ్‌గా కొనసాగింది. శుభలేఖ సుధాకర్, హర్షవర్ధన్ తమ పరిధి మేరకు నటించారు. జేడీ చక్రవర్తి మార్క్ ఈ సినిమాలో కనిపించలేదు. మాసస చౌదరి పాత్రకు పెద్దగా ప్రాధాన్యత కనిపించలేదు.సినిమాటోగ్రఫీ బాగుంది. పాటుల, నేపథ్య సంగీతం ఇంప్రెసివ్‌గా లేవు. నిర్మాణ విలువలు పర్వాలేదు. అక్కడక్కడా కాసిని నవ్వులు మినహా 'గాయపడ్డ సింహం' అంతా బోరింగ్‌గానే ఉంది. ఈ సింహంలో ఎనర్జీ, పవర్ మిస్ అయ్యింది. ప్రేక్షకులను అలరించడంలో ఈ 'గాయపడ్డ సింహం' చతికిలపడి.. వెనకడుగు వేసింది.



# 13 ఏళ్ల చెల్లికి బర్త్ డే విషెస్ తెలిపిన రష్మిక

**13వ ఏట అడుగుపెట్టిన చెల్లి షిమన్‌కు రష్మిక బర్త్ డే విషెస్**

**చెల్లిని తన కూతురిలా చూసుకుంటానని తెలిపిన నటి**

**ఫిబ్రవరిలో విజయ్ దేవరకొండతో తన పెళ్లికి షిమన్ హాజరైందని వెల్లడి**

**'మైసా' సినిమా కోసం కేరళలో యాక్షన్ షెడ్యూల్‌లో పాల్గొంటున్న రష్మిక**

**షాహిద్ కపూర్‌తో కలిసి 'కాక్‌టెయిల్ 2'లో నటించనున్న వైనం**

స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న తన చెల్లి షిమన్ మందన్నపై ప్రేమను కురిపిస్తూ పెట్టిన సోషల్ మీడియా పోస్ట్ వైరల్ అవుతోంది. శనివారం షిమన్ 13వ పుట్టినరోజు జరుపుకోగా, రష్మిక ఆమెకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. చెల్లిని గట్టిగా హత్తుకున్న ఫోటోను పంచుకుంటూ.. "నా స్వీటీకి 13వ పుట్టినరోజు శుభాకాంక్షలు! ఈ వయసు చాలా సరదాగా ఉంటుంది, దాన్ని ఆస్వాదించు. ఐ లవ్ యూ స్వీటీ!! నీకు పెద్ద హగ్స్!" అని రాసుకొచ్చారు. కేక్ కట్ చేస్తున్న, ముఖానికి కేక్ అంటిన షిమన్ క్యూట్ ఫోటోలను కూడా పంచుకున్నారు. రష్మిక, ఆమె చెల్లి షిమన్‌కు మధ్య 16 ఏళ్ల వయసు వ్యత్యాసం ఉంది. ఈ కారణంగానే షిమన్‌ను తన కూతురిలా చూసుకుంటానని రష్మిక గతంలో చాలాసార్లు చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉదయ్‌పూర్‌లో నటుడు విజయ్ దేవరకొండతో తన వివాహానికి షిమన్ హాజరైందని కూడా ఈ సందర్భంగా ప్రస్తావించడం ఆసక్తికరంగా మారింది.

ఇక సినిమాల విషయానికొస్తే, రష్మిక ప్రస్తుతం పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ "మైసా" షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇటీవలే కేరళలో 15 రోజుల యాక్షన్ షెడ్యూల్ ప్రారంభమైంది. ఈ సినిమాలోని యాక్షన్ సన్నివేశాల కోసం రష్మిక థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నారు. అక్కడ రోజుకు 8 గంటలకు పైగా కఠినమైన స్టంట్స్ నేర్చుకున్నారు. ఈ చిత్రంలో రష్మిక గిరిజన యువతి పాత్రలో కనిపించనున్నారు.

"మైసా" చిత్రంలో రష్మికతో పాటు ఈశ్వరీరావు, గురు సోమసుందరం, రావు రమేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇది కాకుండా, షాహిద్ కపూర్, కృతి సనన్‌లతో కలిసి హిందీలో "కాక్‌టెయిల్ 2" చిత్రంలో కూడా రష్మిక నటిస్తున్నారు.



# ఆడుతూపాడుతూ గెలిచిన చెన్నై...

# ముంబై ఈసారి కూడా కుదేల్!

- **ముంబై ఇండియన్స్‌పై చెన్నై సూపర్ కింగ్స్ 8 వికెట్ల తేడాతో గెలుపు**
- **కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, కార్తీక్ శర్మ అజేయ అర్ధశతకాలు**
- **98 పరుగుల కీలక భాగస్వామ్యంతో చెన్నైకి సునాయాస విజయం**
- **మొదట బ్యాటింగ్ చేసిన ముంబై 7 వికెట్లకు 159 పరుగులు**
- **చెన్నై బౌలర్లలో అన్షుల్ కంబోజ్ కు మూడు వికెట్లు**



ఐపీఎల్ 2026లో చెన్నై సూపర్ కింగ్స్ అద్భుతమైన ప్రదర్శనతో అదరగొట్టింది. చెపాక్ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (67 నాటౌట్), కార్తీక్ శర్మ (54 నాటౌట్) అజేయ అర్ధశతకాలతో చెలరేగి జట్టుకు సునాయాస విజయాన్ని అందించారు.

160 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నైకి ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. సంజూ శాంసన్ (11), ఉర్విల్ పటేల్ (24) త్వరగానే వెనుదిరిగారు. దీంతో 62 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన జట్టును కెప్టెన్ గైక్వాడ్, కార్తీక్ శర్మ ఆదుకున్నారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 98 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పి మరో 11 బంతులు మిగిలి ఉండగానే జట్టును విజయతీరాలకు చేర్చారు. గైక్వాడ్ 48 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో, కార్తీక్ శర్మ 40 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో రాణించారు.



అంతకుముందు, టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 159 పరుగులు మాత్రమే చేయగలిగింది. నమన్ ధిర్ (57) ఒక్కడే అర్ధశతకంతో రాణించగా, కెప్టెన్ హార్దిక్ పాండ్యా (23 బంతుల్లో 18) నెమ్మదిగా ఆడి నిరాశపరిచాడు. చెన్నై బౌలర్లలో అన్షుల్ కంబోజ్ 3 వికెట్లతో ముంబై పతనాన్ని శాసించగా, నూర్ అహ్మద్ 2 వికెట్లతో అతనికి సహకరించాడు. ఈ విజయంతో చెన్నై పాయింట్ల పట్టికలో మరింత ముందుకు దూసుకెళ్లింది.

# మహిళల టీ20 ప్రపంచకప్‌కు భారత జట్టు ఇదే..

**- సంచలన పేసర్‌కు తొలి అవకాశం!**

**- మహిళల టీ20 ప్రపంచకప్‌కు భారత జట్టును ప్రకటించిన బీసీసీఐ**

**- గాయం నుంచి కోలుకుని జట్టులోకి తిరిగి వచ్చిన యాస్తిక భాటియా**

**- స్పిన్నర్ రాధా యాదవ్‌కు మళ్లీ చోటు**

**- డబ్ల్యూపీఎల్‌లో రాణించిన యువ పేసర్ నందిని శర్మకు తొలిసారి అవకాశం**

**- జూన్ 14న పాకిస్థాన్‌తో భారత్ తన తొలి మ్యాచ్ ఆడనుంది**



జూన్ 12 నుంచి జరగనున్న 2026 మహిళల టీ20 ప్రపంచకప్ కోసం 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును బీసీసీఐ శనివారం ప్రకటించింది. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా, స్మృతి మంధన వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఈ జట్టులో వికెట్ కీపర్ యాస్తిక భాటియా, స్పిన్నర్ రాధా యాదవ్ పునరాగమనం చేయగా, డబ్ల్యూపీఎల్‌లో సత్తా చాటిన యువ ఫాస్ట్ బౌలర్ నందిని శర్మకు అనూహ్యంగా తొలిసారి అవకాశం దక్కింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, చీఫ్ సెలక్టర్ అమితా శర్మ ఈ వివరాలను మీడియా సమావేశంలో వెల్లడించారు. మోకాలి శస్త్రచికిత్స కారణంగా 2025 వన్డే ప్రపంచకప్‌కు దూరమైన యాస్తిక భాటియా, పూర్తిగా కోలుకుని తిరిగి జట్టులోకి వచ్చింది. గత ఏడాది ఇంగ్లండ్ సిరీస్‌లో రాణించిన రాధా యాదవ్ కూడా స్క్వాడ్‌లో చోటు దక్కించుకుంది. ఇక, డబ్ల్యూపీఎల్ 2026లో హ్యాట్రిక్ సాధించి సంచలనం సృష్టించిన నందిని శర్మ, జట్టు పేస్ బౌలింగ్‌ను బలోపేతం చేయనుంది. సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్లు అమన్‌జోత్ కౌర్ (వెన్నునొప్పి), కష్వీ గౌతమ్ (మోకాలి గాయం) దూరం కావడంతో నందినికి ఈ అవకాశం లభించింది. తెలుగమ్మాయిలు శ్రీ చరణి, అరుంధతిరెడ్డి కూడా వరల్డ్ కప్ జట్టుకు ఎంపికయ్యారు. జూన్ 12 నుంచి జులై 5 వరకు జరగనున్న ఈ వరల్డ్ కప్ టోర్నీలో భారత్ గ్రూప్ 1లో ఉంది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్‌తో భారత్ తలపడనుంది. జూన్ 14న పాకిస్థాన్‌తో భారత్ తన తొలి మ్యాచ్ ఆడనుంది. 2020లో రన్నరప్‌గా నిలిచిన భారత్, ఈసారి ఎలాగైనా కప్ గెలవాలనే పట్టుదలతో ఉంది. ఈ ప్రపంచకప్ కంటే ముందు, మే 28 నుంచి జూన్ 2 వరకు ఇంగ్లండ్‌తో జరిగే మూడు టీ20ల సిరీస్‌లో కూడా ఇదే జట్టు ఆడనుంది.

భారత జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, భారతి ఫుల్మాలి, దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), శ్రీ చరణి, యాస్తిక భాటియా (వికెట్ కీపర్), నందిని శర్మ, అరుంధతి రెడ్డి, రేణుకా సింగ్ ఠాకూర్, క్రాంతి గౌడ్, శ్రేయాంక పాటిల్, రాధా యాదవ్.

## జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను

# సత్వరమే పరిష్కరించాలి

- ఎస్సీ, ఎస్టీల ఆర్థిక అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక
- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్
- ఎలాంటి పక్షపాతం, జాప్యం లేకుండా ఎస్సీ ఎస్టీ కేసులను విచారణ చేయడం జరుగుతుంది
- జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి





**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం :** జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం మదనపల్లి కలెక్టరేట్లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటి సమావేశం నిర్వహించారు.
ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్, రెవెన్యూ, ప్రాసిక్యూషన్ విభాగాలు సమన్వయంతో పనిచేసి ఎస్సీ, ఎస్టీ వర్గాలపై నమోదు అయిన కేసుల్లో జాప్యాన్ని నివారించి సత్వర న్యాయం అందించాలన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారంలో భాగంగా... సంఘటనలు జరిగిన వెంటనే పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేసి కేసులు నమోదు చేయా లన్నారు. ఎఫ్ఐఆర్ కాగానే బాధితులకు పరిహారం అందజేసేలా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు ఎక్కడ అన్యాయం జరిగినా అధికారుల దృష్టికి తీసుకురావాలని డివిఎంసి కమిటీ సభ్యులకు సూచించారు. 2025 సెప్టెంబర్ 10 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు వరకు జిల్లాలో మొత్తంగా 14 ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు అయి విచారణ దశలో ఉన్నాయని వాటిని త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా కేసువారీగా పరిష్కార చర్లపై చర్చించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా పోలీసులతోపాటు సంబంధిత శాఖల అధికారులు చొరవ తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. కేసులలో ఎప్పటి కప్పుడు ఛార్జిషీట్ దాఖలు చేయడంతో పాటు నిర్ణీత సమయంలోగా కేసులను పూర్తిచేయాలని అన్నారు. బాధితులకు ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం సకాలంలో అందేలా చూడాలన్నారు. మండల, డివిజన్ స్థాయిలో ప్రతినెల క్రమం తప్పకుండా సివిల్ రైట్స్ డే నిర్వహించాలని, ఎస్సీ ఎస్టీ కేసులకు సంబంధించి కుల ధృవీకరణ పత్రాలను సంబంధిత తాసిల్దారులు వెంటనే జారీ చేయాలని, డివిజన్ స్థాయి అధికారులు దీనిని తగిన పర్యవేక్షించాలని సూచించారు. స్పీడ్ కేసులలో త్వరితగతిన జడ్జిమెంట్ వచ్చేలా పోలీస్, న్యాయశాఖ పిపీలు కృషి చేయాలని తెలిపారు.

**ఎస్సీ ఎస్టీల ఆర్థిక అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక**

జిల్లా నందలి ఎస్సీ ఎస్టీలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా తగిన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. జలధార కార్యక్రమం వల్ల జిల్లాలో భూగర్భ జలాలు, నీటి వనరులు పెరిగాయి. ప్రతి గ్రామంలో ఆసక్తి గలవారికి పాలిచ్చే పశువులు పెంచుకునేలా ప్రోత్సహిస్తున్నాం. ఈ మేరకు ఎస్సీ ఎస్టీలను కూడా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. మాన్సూన్ సీజన్ మొదలయ్యేలోపు ఆసక్తి గలవారు ముందుకు వస్తే డిఆర్డిఏ శాఖ ద్వారా ఎస్సీ ఎస్టీల మహిళ సంఘాలకు బ్యాంకు రుణాలు మంజూరు చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మాట్లాడుతూ జిల్లాలో నమోదైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి ఎలాంటి పక్షపాతం, జాప్యం లేకుండా విచారణ చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ కేసులకు సంబంధించిన ఎలాంటి సమాచారం అయినా తమ దృష్టికి తీసుకురావాలని సభ్యులను కోరారు. ఇప్పటికే నమోదైన అండర్ ట్రయల్ కేసులు, వాటి పరిష్కారం కొరకు తీసుకోవాల్సిన చర్యలపై ఎస్డిపిఓలు, డీవీఎంసీ సభ్యులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన ఎస్సీ ఎస్టీ కేసుల ప్రగతి, ఆయా అంశాలలో తీసుకున్న చర్యలపై డివిఎంసి సభ్యులు అడిగిన సందేహాలకు కలెక్టర్ మరియు ఎస్పి సందేహ నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో అన్ని మండలాలలో ఎస్సీ, ఎస్టీల స్మశాన వాటికలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని కమిటీ సభ్యులు కలెక్టర్కు విన్నవించారు. ఈ అంశాలను ప్రత్యేక దృష్టితో సానుకూలంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని కమిటీ సభ్యులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. అంతకుముందుగా గత సమావేశంలో చర్చించిన అంశాలపై సంబంధిత అధికారులు తీసుకున్న చర్యలు పరిష్కరించిన కేసులపై సమావేశంలో చర్చించి, ఇంకనూ తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్, ఎస్పీ అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాస్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎం.శ్రీరాములు, డీఎస్పీలు, డివిఎంసి సభ్యులు వెంకటరమణ, రామకృష్ణ, శ్రీనివాసులు, రాజశేఖర్, చంద్రశేఖర్ బోడేషావలి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు హాజరయ్యారు.

# విలేఖరిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

### ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్కింగ్ జర్నలిస్ట్ ఐక్యవేదిక అధ్యక్షులు పి. రామాంజనేయ ప్రసాద్



**అనంతపురం– సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లాలో దినపత్రికలో విలేఖరిగా పనిచేస్తున్న లక్ష్మీనారాయణపై జరిగిన దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, బాధిత జర్నలిస్టు తరపున ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్కింగ్ జర్నలిస్ట్ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పి. రామాంజనేయ ప్రసాద్ (శింగనమల ప్రసాద్) ఆధ్వర్యంలో పత్రికా ప్రకటన విడుదల చేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనంతపురంలోని శ్రీ గీతం జూనియర్ కళాశాలలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై మనం దినపత్రికలో విలేకరిగా పనిచేస్తున్న లక్ష్మీనారాయణ వరుసగా వార్తా కథనాలు ప్రచురించ డంతో ఆగ్రహించిన కళాశాల యాజమాన్యం ప్రణాళికాబద్ధంగా గుండాలతో కలిసి అతని ఇంటికే వెళ్లి దాడి చేశారని ఆ కళాశాల యాజమాన్యం అవిలేఖరిపై దాడిని మొబైల్ ఫోన్లో చిత్రీకరించి దాడి చేశారని ఆరోపించారు. శనివారం జరిగిన ఈ ఘటనలో లక్ష్మీనారాయణపై విచక్షణ రహితంగా దాడి చేయడమే కాకుండా, కుటుంబ సభ్యుల ఎదుట అవమానకరంగా ప్రవర్తించి భయభ్రాంతులకు గురిచేసినట్లు తెలిపారు. అతడిని బలవంతంగా కాళ్లు మొక్కించుకోవడం వంటి అమానుష చర్యలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ దాడి పూర్తిగా ప్రణాళికతో, వార్తలు రాయకుండా బెదిరించే ఉద్దేశంతో జరిగినదని బాధితుడి తరపున వివరించారు.
వార్తా కథనాలు ప్రజల ప్రయోజనాల కోసం రాయబడుతాయని, వాటిలో తప్పులు ఉన్నాయని భావిస్తే చట్టపరంగా స్పందించాల్సిన అవసరం ఉందని, కానీ గుండాలతో కలిసి దాడులు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు విరుద్ధమని ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్కింగ్ జర్నలిస్ట్ ఐక్యవేదిక అధ్యక్షులు పి. రామాంజనేయ ప్రసాద్ అన్నారు. జర్నలిస్టులపై ఇలాంటి దాడులు జరగడం మీడియా స్వేచ్ఛను హరించడమే కాకుండా ప్రజల హక్కులను కూడా దెబ్బతీస్తుందని ఆయన పేర్కొన్నారు.
దళిత వర్గానికి చెందిన జర్నలిస్టుపై ఈ విధంగా దాడి జరగడం అత్యంత ఆందోళనకరమని ఆయన అన్నారు. ఈ ఘటనపై పోలీసులు వెంటనే స్పందించాలని దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత జర్నలిస్టుకు పూర్తి రక్షణ కల్పించడంతో పాటు అతని కుటుంబ సభ్యులకు భద్రతను అందించాలని కోరారు. అలాగే, బాధితుడికి తగిన న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వైద్య ఖర్చులు మరియు ఆర్థిక సాయం అందించాలని సూచించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు సంబంధిత అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. అనంతపురంలోని శ్రీ గీతం జూనియర్ కళాశాలలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై జిల్లా కలెక్టర్ తక్షణ విచారణ ఆదేశించాలని, సంబంధిత యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టు రాసిన వార్తలపై అసంతృప్తి ఉంటే చట్టపరంగా ముందుకు రావాలని, కానీ వ్యక్తిగత దాడులు చేయడం పూర్తిగా అనాగరిక చర్యగా ఆయన అభివర్ణించారు. జర్నలిస్టుల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని, వార్తల కోసం ప్రాణాల పణంగా పెట్టి పనిచేస్తున్న విలేఖరులను రక్షించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులలో ఆందోళన కలిగించిందని, ఇలాంటి దాడులు కొనసాగితే మీడియా రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ ఘటనపై తక్షణ చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులందరినీ ఏకం చేసి పెన్‌డౌన్ ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని, అవసరమైతే పెద్ద ఎత్తున నిరసనలు నిర్వహిస్తామని తెలిపారు. జర్నలిస్టుల గౌరవం, ప్రాణాలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైతే పోరాటం తప్పదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని, ప్రజల సమస్యలను వెలికి తీసే జర్నలిస్టులను రక్షించడం సమాజం మొత్తం బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. బాధిత జర్నలిస్టుకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్కింగ్ జర్నలిస్ట్ ఐక్యవేదిక అధ్యక్షులు పి. రామాంజనేయ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

## పోలేరమ్మ జాతరలో పాల్గొన్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి





**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం :** అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం రామా పురం మండలం కుమ్మరపల్లిలో నిర్వహించిన పోలేరమ్మ తల్లి జాతర సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన ఓ క్రీడా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంత ప్రజల సుఖశాంతులు, అభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం కుమ్మరపల్లిలో ప్రదీప్ ఏర్పాటు చేసిన విందులో మంత్రి పాల్గొని గ్రామస్తులతో ఆత్మీయంగా ముచ్చటించారు. స్థానిక ప్రజలు మంత్రివర్యులకు ఘన స్వాగతం పలుకగా, జాతర వేడుకలు ఆనందోత్సాహాల మధ్య కొనసాగాయి. కార్య క్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగన్వాడీ పోస్టులకు

# దరఖాస్తు చేసుకోండి

- ఐసీడీఎస్ పీడీ శశికళ
- 11 ప్రాజెక్టుల్లో మొత్తం 238 పోస్టులు ఖాళీ
- అందులో అంగన్వాడీ వర్కర్లు 14, ఆయా పోస్టులు 224 ఖాళీలు
- 10 రోజుల్లోగా దరఖాస్తుల ఆహ్వానం



**అనంతపురం– సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లాలోని 11 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో అంగన్వాడీ పోస్టుల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆ శాఖ పీడీ శశికళ శనివారం తెలిపారు. మొత్తం ఖాళీలు 238 ఉండగా, అందులో అంగన్వాడీ వర్కర్ పోస్టులు 14, ఆయా పోస్టులు 224 ఖాళీ ఉన్నట్లు వివరించారు. అర్హత కలిగి, ఆసక్తి ఉన్న వారు పది రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను ఆయా ప్రాజెక్టు కార్యాలయాల్లో సమర్పించి, రసీదు పొందాలని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత కలిగి, వివాహమైన వారు మాత్రమే అర్హులన్నారు. పోస్టులు ఖాళీ ఉన్న ప్రాంత కోడలై ఉండాలని తెలిపారు. ఎక్కడెక్కడ ఏయే పోస్టు ఖాళీ ఉన్నాయి, రిజర్వేషన్ గురించిన సమగ్ర సమాచారం ఆయా ప్రాజెక్టుల నోటీసు బోర్డులో అతికించినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు అక్కడికెళ్లి పరిశీలించవచ్చన్నారు.

## శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు



**ఉరవకొండ – సూర్య వాస్తవం :** ఉరవకొండ డ్రైవర్స్ కాలనీలోని శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఆలయ అర్చకులు కరణం సాయికృష్ణ ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారి మూలవిరాట్టుకు శాస్త్రోక్తంగా అభిషేకాలు నిర్వహించారు. అభిషేకం అనంతరం స్వామివారిని అత్యంత సుందరంగా అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహా **మంగళహారతి:** భక్తుల జయ జయ ధ్వానాల మధ్య మహా మంగళహారతి కార్యక్రమం కన్నులపండువగా జరిగింది. డ్రైవర్స్ కాలనీ, చుట్టప్రక్కల కాలనీలలోని భక్తులందరూ ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొని మొక్కలు చెల్లించి తీర్థప్రసాదాలు స్వేకరించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad )